

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

స్వాతంత్ర్యం రాకపైన
సంధించిన వాగ్బాణం
నలభై ఏడు గుర్తించని
నేడు మూఢ అజ్ఞానం
ఎవరు ప్రవచించినది
ఎప్పటికీ తప్పే కదా
రాజ్యం సహిస్తే దాన్ని
రాజ్యాంగం ముప్పే కదా
-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 17-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:125 పేజీలు:6 వెల: రూ.1/-

# ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ నిర్వహించాలి - మంత్రి సీతక్క ఆదేశం



హైదరాబాద్, జనవరి 16: అంగన్వాడీ సేవలపై చిన్నారుల పేరెంట్స్ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతి, నూతన ప్రణాళికలు, పనితీరు మెరుగుదలపై చర్చించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజల సంక్షేమమే లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారికి పౌష్టికాహారం అందించేందుకు జిల్లా సంక్షేమ అధికారులు కృషి చేయాలన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణుల కోసం బెంచీలు

మంత్రి సీతక్క మాట్లాడుతూ తల్లి దండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు ఉంటాయని, అంగన్వాడీకి వచ్చే గర్భిణీలు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్వాడీ కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేనట్టుగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో డ్రైవ్ నిర్వహించి దివ్యాంగులకు పరికరాలను అందజేస్తామని చెప్పారు. అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయండని స్పష్టం చేశారు.

## ఎవరూ తప్పులు చేయొద్దు!

మా మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దని.. అధికారులు, అమాత్యులు వేరు వేరు కాదన్నారు. మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయవద్దన్నారు. ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దని సూచించారు. కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైందని, ఉపాధి హామీ పథకం రూ. 300 కోట్ల బిల్లులను విడుదల చేశామని, మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశామని వెల్లడించారు. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్లైన్ లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలని ఆదేశించారు.

# మంత్రిగా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెబితే అభ్యంతరం ఎందుకు..

## -బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై ఆగ్రహం వ్యక్తం

ఖమ్మం జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటుపై తెలంగాణ మంత్రిగా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెబితే అరవింద్‌కు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. తన రాజకీయ జీవితంపై అరవింద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అరవింద్ దిగజారి మాట్లాడుతారని ఊహించలేదని విమర్శించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంత్రి తుమ్మల పర్యటించారు. బుధవారం రాత్రి అగ్నిప్రమాదంలో దగ్ధమైన పత్తి బస్తాలను పరిశీలించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగిన తర్వాత సిబ్బంది నిర్లక్ష్యం చేయడంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అగ్ని ప్రమాద ఘటనలో పత్తి బస్తాలు దగ్ధం అవ్వడం దురదృష్టకరమని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల వాగ్దానంలో భాగంగా రూ.100 కోట్లతో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. రైతులకు సౌకర్యంగా ఉండేలా వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

# నలుగురు మావోయిస్టులు మృతి



రాయ్‌పూర్, జనవరి 16: ఛత్తీస్‌గఢ్‌లోని దట్టమైన అడవుల్లో మరోసారి తుపాకులు గర్జించాయి. బుల్లెట్ల వర్షం కురిసింది. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు పోలీసు స్టేషన్ పరిధిలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. పామేడు -మద్దేడు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడినట్లు ఒంది. మావోయిస్టుల మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ ఎదురుకాల్పుల్లో భద్రతా బలగాలకు ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ఈ ఎదురుకాల్పులకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# భారత గణతంత్ర వేడుకలకు చీఫ్ గెస్ట్‌గా ఇండోనేషియా అధ్యక్షుడు



న్యూఢిల్లీ, జనవరి 16:భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవా సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా గురువారం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఇండోనేషియా అధ్యక్షుడు రిపబ్లిక్ వేడుకలకు హాజరవుతున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో ఇండియాలో ఇండోనేషియా ప్రెసిడెంట్ జనవరి 25, 26 తేదీల్లో పర్యటించనున్నారు.

2024 అక్టోబర్‌లో ప్రబోవా సుబియాంటో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. భారత్‌లో ఆయన అడుగుపెట్టడం ఇదే తొలిసారి అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు దోహద పడుతుందని తెలిపింది. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలను చర్చించడానికి అవకాశాన్ని కల్పిస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. సుబియాంటో 2020లో ఇండోనేషియా రక్షణ మంత్రిగా న్యూఢిల్లీని సందర్శించారు.


కాగా 1950 నుంచి భారత్ తన మిత్ర దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించారు. 2024లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ ముఖ్య అతిథిగా రాగా.. 2023లో ఈజిప్ట అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎస్-సిసిని అతిథిగా వచ్చారు. 2021, 2022 సంవత్సరాల్లో కరోనా కారణంగా గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథులను ఆహ్వానించలేదు.

అంతకుముందు 2020లో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో, 2019లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2018లో ఆసియా దేశాలకు చెందిన 10 మంది నాయకులు వచ్చారు. 2017లో అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ రాగా.. 2016లో ఫ్రెంచ్ అప్పటి అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలాండే, 2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2007లో పుతిన్(రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్) హాజరయ్యారు

# పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు వెళ్ళిన బీఆర్‌ఎస్ పార్టీ

న్యూ డిల్లీ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ పార్టీ దేశ అత్యున్నత ధర్మాసనం సుప్రీంకోర్టుకు వెళ్లింది.పార్టీ మారిన ఎంఎల్ఎలపై అనర్హత వేటు వేయాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై రెండు పిటిషన్లు దాఖలు చేశారు. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలె యాదయ్య, సంజయ్ కుమర్, కృష్ణమోహన్, మహిపాల్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీపై కోర్టులో బిఆర్ఎస్ రిట్ పిటిషన్ వేయగా..దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిపై ఎస్ఎల్పీ పిటిషన్ దాఖలు చేసింది. పార్టీ ఫిరాయింపులపై ప్రస్తుతం ఢిల్లీలో మాజీ మంత్రి హరీష్‌రావు, లాయర్లతో చర్చిస్తున్నట్లు సమాచారం.

# ఒక్కటైన 2 శాటిలైట్లు.. డాకింగ్ సక్సెస్ వెనుక ఇస్రో ప్లానేంటి !



హైదరాబాద్, జనవరి 16: ఇస్రో ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు ఇవాళ అంతరిక్షంలో అనుసంధానం అయ్యాయి. స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతమైనట్లు ఇవాళ ఇస్రో ప్రకటించింది. ఇది చరిత్రాత్మక సందర్భమని ఇస్రో తన ట్వీట్‌లో వెల్లడించింది. సుమారు 15 మీటర్ల దూరం నుంచి 3 మీటర్ల దూరం వరకు రెండు శాటిలైట్లను తీసుకువచ్చేందుకు ఇస్రో పలు ప్రయత్నాలు చేపట్టింది. రెండు సార్లు డాకింగ్ ప్రాసెస్‌ను వాయిదా కూడా వేసింది. కానీ ఇవాళ ఆ ప్రక్రియను విజయవంతంగా ముగించింది. డాకింగ్ స్టంట్‌లో సక్సెస్ కావడంతో.. ఆ ప్రక్రియను చేపట్టిన నాలుగవ దేశంగా ఇండియా నిలిచింది. భారత ప్రధాని మోదీ.. ఇస్రో టీమ్‌కు కంగ్రాట్స్ కూడా తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం
చిమ్మపూడి ఫౌండేషన్
వారి సంయుక్త ఆధ్వర్యంలో
యువ భువన విజయం
సాహిత్య సంగీత రూపకం



పాత్రధారులందరూ విద్యార్థినులే

తేది : 19-01-2025, ఆదివారం సా॥ 6-00 గం॥లకు
సభాస్థలి : యన్.టి.ఆర్. కళామందిరం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్.

ముఖ్య అతిథి : శ్రీమతి సురభి వాణీదేవి, సభ్యులు, తెలంగాణ శాసనమండలి
అధ్యక్షులు : డా॥ కె.వి. రమణాచారి, అధ్యక్షులు, శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం
విశిష్ట అతిథి : డా॥ వెలుదండ నిత్యానందరావు, ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
డా॥ మరుమాముల దత్తాత్రేయశర్మ, ప్రముఖ సాహితీవేత్త

చిమ్మపూడి శ్రీరామమూర్తి, అధ్యక్ష్యులు, చిమ్మపూడి ఫౌండేషన్
టి. ఉడయవర్లు, గౌరవ కార్యదర్శి

అందరూ ఆహ్వానితులే

సాంస్కృతిక కార్యక్రమం :
యువ భువన విజయం
(సాహిత్య సంగీత రూపకం)

ఇందు పాల్గొనువారు :

| పాత్ర | పాత్రధారి |
| --- | --- |
| 1. శ్రీకృష్ణదేవరాయలు | నిత్యశ్రీ గోవిందు, 11వ తరగతి |
| 2. మహామంత్రి తిమ్మరుసు | ఋగ్వేదం కృష్ణశ్రీ, బి.టెక్-1 |
| 3. అల్లసాని పెద్దన | ఋగ్వేదం పద్మశ్రీ, బి.టెక్ (ఉద్యోగ ప్రశిక్షణ) |
| 4. నంది తిమ్మన | ప్రమద్వర జక్కు, బి.టెక్ ఫైనల్ |
| 5. ధూర్జటి | పావని జనమంచి, ఫిజియోథెరపీ |
| 6. పింగళి సూరన | వి.వి. నాగసింధు, ఇంటర్-1 |
| 7. రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) | వేద శివాని లక్కోజు, 9వ తరగతి |
| 8. మాదయగారి మల్లన | శరణ్యాక్షిత చెన్నుబొట్ల, 9వ తరగతి |
| 9. అయ్యలరాజు రామభద్రుడు | దివ్యాంశి బొమ్మకంటి, 9వ తరగతి |
| 10. తెనాలి రామకృష్ణ | రంగా భవ్యకృతి, ఇంటర్-1 |
| 11. మొల్లమాంబ | కొలనుపాక రాఘవీరావు, ఇంటర్-1 |
| 12. ప్రగడరాజు నరసరాజు | దివాకర్ల వేద సంహిత, ఇంటర్-1 |
| 13. ప్రయోక్త | దుద్దిళ్ల శ్రీవల్లి, ఇంటర్-1 |
| 14. భటుడు | యర్రబల్లి లక్ష్మీవారిజ, 8వ తరగతి |

# బొగ్గు కుంభకోణం విచారణ ధర్మాసనం నుంచి తప్పుకున్న జస్టిస్ కేవీ విశ్వనాథన్

న్యూఢిల్లీ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బొగ్గు కుంభకోణం పై నమోదు అయిన కేసులపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ కేసుల్ని విచారిస్తున్న ధర్మాసనం నుంచి సుప్రీంకోర్టు జడ్జి జస్టిన్ కేవీ విశ్వనాథన్ తప్పుకున్నారు. ఓ కేసులో తాను లాయర్‌గా వాదించినట్లు ఆయన పేర్కొన్నారు. బొగ్గు స్కామ్‌పై కేసుల విచారణకు కొత్త ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. సుప్రీం ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కుమార్ కూడా ఉన్నారు.ఫిబ్రవరి 10వ తేదీ నుంచి జరిగే విచారణల కోసం కొత్త త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. బొగ్గు కుంభకోణాలపై హైకోర్టుల్లో విచారణ చేపట్టరాదు అని గతంలో సుప్రీం పేర్కొన్నది.

# పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక- మంత్రి దామోదర్





మహబూబ్‌నగర్,జనవరి 16:ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందాలని, లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, ప్రత్యేక అధికారి రవి, జిల్లా శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, కూచుకుల్ల రాజేష్, మేఘా రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, కసిరెడ్డి నారాయణ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డితో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాల అమలుపై జరిగిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యాచరణ సమన్వయ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూలంకషంగా సమీక్షించి సమర్థ నిర్వహణకు జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు విజయేందిర బోయి, బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి, బి.ఎం. సంతోష్, ఆయా జిల్లాల ఆదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26వ తేదీన ఈ నాలుగు పథకాలను ప్రారంభించనుందన్నారు. పథకాల అమలులో భాగంగా నిర్వహించే గ్రామ సభల్లో ఎమ్మెల్యేలు, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రచార లోపనీ, సమన్వయం లోపనీ ఉండకూడదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పథకాలను అమలు చేయాలన్నారు.

కొత్తగా ప్రారంభించబోయే నాలుగు పథకాలు ఓ అద్భుతమని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో జరిగే గ్రామసభల్లో తాను, సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా రెండు, మూడు గ్రామాల్లో పాల్గొంటామని ఆయన తెలిపారు. ఐదు రోజుల కార్యక్రమ సమాచారం నియోజకవర్గాల వారిగా ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఉన్న వారికి పథకాల వర్తింపు పై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని ప్రసంగించారు.

# హైకోర్టుకు మరో నలుగురు కొత్త న్యాయమూర్తులు

## -సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు ఎపికి ఇద్దరు

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు సిజెగా బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు సిజెగా బదిలీ అయ్యారు. 1964 జూన్ 21న జన్మించిన జస్టిన్ సుజయ్‌పాల్ బీకాం, ఎంఎ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించిన ఆయన 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన హైకోర్టు సిజెగా నియమితులయ్యారు.

నలుగురు కొత్త న్యాయమూర్తులు

కాగా తెలంగాణ హైకోర్టుకు మరో నలుగురు కొత్త న్యాయమూర్తులు నియామకం కానున్నారు. వీరిలో జస్టిస్ రేణుక, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ తిరుమల దేవి, జస్టిస్ మధుసూదన్‌రావు ఉన్నారు. వీరి నలుగురి పేర్లను సుప్రీంకోర్ట్ కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. ఎపి హైకోర్టుకు హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లు సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. జ్యూడీషియల్ ఆఫీసర్ల కోటాలో మొత్తంగా ఈ ఆరుగురి పేర్లను తెలంగాణ, ఎపి హైకోర్టులకు కొలీజియం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

# యూఎస్ వ్యవస్థాపక పితామహుడు 'బెంజమిన్ ఫ్రాంక్లిన్'

## (17 జనవరి "బెంజమిన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం" సందర్భంగా)

స్వతంత్ర అమెరికా చరిత్రలో అత్యంత బహుముఖ ప్రతిభాశాలి, పేరెన్నికగల అమెరికా సంయుక్త రాష్ట్రాల "వ్యవస్థాపక పితామహుడు"గా బెంజమెన్ ఫ్రాంక్లిన్ ప్రపంచవ్యాప్త ఖ్యాతిని పొందారు. ఒక సాధారణ వ్యక్తి ఎలాంటి పై చదువులు చదవకుండానే అనేక రంగాల్లో తన ప్రతిభను ప్రదర్శించారు. కవి, రచయిత, పబ్లిషర్, ప్రింటర్, రాజకీయ తత్వవేత్త, సామాజిక చైతన్యశీలి, దౌత్యవేత్త, శాస్త్రవేత్త, సంగీత విద్వాంసుడు, మ్యాప్‌మేకర్, ఆవిష్కర్త, రాజకీయవేత్త, పోస్ట్‌మ్యాన్ అయిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ అమెరికా చరిత్రలో చెరగని ముద్ర వేశారు. 1776లో బ్రిటన్ వలసపాలనలో ఉన్న 'అమెరికా స్వాతంత్ర్య ప్రకటన' రచనా కమిటీ ఐదుగురిలో ఒక సభ్యుడిగానే కాకుండా మరో నాలుగు ముఖ్యమైన పత్రాలపై సంతకం చేసిన ఘనుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్.

### సాధారణ జీవితంతో అసాధారణ సాఫల్యత:

17 జనవరి 1706న ఒక సాధారణ సబ్బులు-కొవ్వత్తులు తయారు చేసే కుటుంబంలో జోసియ్య ఫ్రాంక్లిన్-అభిషా ఫోల్గర్ దంపతులకు పదవ సంతానంగా జన్మించారు. తన 10వ ఏటనే బడికి వెళ్ళడం మానేసి తండ్రికి సహాయకుడిగా సబ్బులు, కొవ్వత్తుల తయారీలో చేయూతను ఇచ్చారు. అలాంటి ఒక అతి చిన్న స్థాయి నుంచి స్వయంకృషితో ఎదిగి అమెరికాలో ఎవరూ సాధించలేని అసాధారణ ఉన్నత స్థాయికి చేరి అందరికీ ఆదర్శంగా నిలిచారు. స్వతంత్ర యూఎస్ ఉనికికి, మనుగడకు గట్టి పునాదులు బెంజమెన్ ఫ్రాంక్లిన్ పుట్టిన రోజు 17 జనవరిన " బెంజమెన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం"గా ప్రతి ఏట నిర్వహించడం సముచితంగా ఉన్నది.

### బెంజమెన్ ఫ్రాంక్లిన్ బహుముఖీన ప్రతిభ:

వైజ్ఞానిక శాస్త్ర రంగంలో 'లైటెనింగ్ రాడ్', 'బైఫోకల్ కళ్లఅద్దాలు', 'ఫ్రాంక్లిన్ స్టౌవ్' లాంటి పలు ఉపకరణాలను కనుకొన్నారు. నేటి ఎలక్ట్రానిక్ రంగం మనం నిత్యం వాడుతున్న పదాలు 'బ్యాటరీ', 'చార్జ్', 'కండక్టర్', 'ఎలక్ట్రిఫై' లాంటి ప్రధాన పదాలను ప్రవేశ పెట్టిన ఘనత బెంజమెన్ ఫ్రాంక్లిన్‌ది మాత్రమే. ఇవే కాకుండా "స్విమ్ ఫిన్స్', 'ఫ్లెగ్జిబుల్ కాథెటర్', 'గ్లాస్ అర్మోనికా', 'లాంగ్ ఆర్మ్', '24-గంటల గడియారం' లాంటి పలు పరికరాలను ఆవిష్కరించారు. 'అమెరికన్ ఫిలాసాఫికల్ సొసైటీ' స్థాపకుడిగా చరిత్రలో నిలిచారు. విద్యారంగంలో 'లైబ్రరీ కంపెనీ ఆఫ్ ఫిలడెల్ఫియా'తో పాటు ఫిలడెల్ఫియా యూనివర్సిటీ' స్థాపనకు ప్రేరణగా నిలిచిన ఫ్రాంక్లిన్ సామాజికశాస్త్ర రంగంలో 'ఫిలడెల్ఫియా ప్రతినిధి'గా సేవలు అందించి, ఫ్రాన్స్‌కు తొలి అమెరికా రాయబారిగా అనుభవం గడించారు. అమెరికా తొలి 'పోస్ట్‌మ్యాన్ జనరల్'గా, మరణానంతరం తొలి పోస్టల్ స్టాంప్‌పై బెంజమెన్ ఫ్రాంక్లిన్ ఫోటో ముద్రించడం జరిగింది. పలు పుస్తకాల రచయితగా నేటికీ తన రచనలతో మార్గనిర్దేశనం చేస్తున్న బెంజమెన్ ఫ్రాంక్లిన్ నేటి అభివృద్ధి చెందిన అమెరికాకు గట్టి పునాదులు వేశారు.

సాంప్రదాయ విద్యాభ్యాసం చేయకుండానే ఒక వ్యక్తి ఇన్ని రంగాల్లో ప్రపంచ ప్రఖ్యాత స్థాయి వ్యక్తిగా ఎదగడం నమ్మశక్యంగా ఉండదు. తన 84వ ఏట 17 ఏప్రిల్ 1790న తుది శ్వాస విడిచిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం ప్రపంచ మానవాళికి, ముఖ్యంగా విశ్వ యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నది. బెంజమెన్ ఫ్రాంక్లిన్ సూచనలతో పలు నగరాలు, విద్యాలయాలు, యూనివర్సిటీలు, దేశాలు, కార్పొరేషన్లకు పేర్లను ఖరారు చేయడం జరిగింది. స్వతంత అమెరికా వ్యవస్థాపక పితామహుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం మనందరికీ దారి దీపం కావాలని కోరుకుందాం, వారి జీవితం నుంచి ప్రేరణను పొందుదాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# శ్రీశైల మహా క్షేత్రం టోల్‌గేట్‌వద్ద సిబ్బంది చేతివాటం: 8 మందిపై వేటు

శ్రీశైలం జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : నంద్యాల జిల్లా శ్రీశైల మహా క్షేత్రం టోల్‌గేట్‌వద్ద ఉన్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిం చడంతో 8 మందిపై వేటు పడింది. టోల్‌గేట్‌లో ఉండాల్సిన డబ్బు కంటే అధికంగా డబ్బు ఉన్నట్లు ఈవో (ఇూ) గుర్తించి వారిపై సస్పెన్షన్ వేటువేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే టోల్‌గేట్ వద్ద వాహనదారుల నుంచి రుసుము వసూలు చేస్తారు. ఈ నెల 5న దేవస్థానం అధికారులు టోల గేట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అయితే సిబ్బంది వద్ద ఉండాల్సిన డబ్బుకంటే అధికంగా డబ్బు ఉన్నట్లు గుర్తించి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఆలయ ఈవో శ్రీనివాసరావు పరిశీలించి 8 మందిపై చర్యలు తీసుకున్నారు. టోల్‌గేట్‌లో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగి ఎం రామకృష్ణుడుతోపాటు కాంట్రాక్టు సిబ్బంది జి మల్లికార్జున రెడ్డి, బి నాగ పరమేశ్వరుడు, ఎన్ గోవిందు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మల్లికార్జున రెడ్డి, బీఆర్ మల్లేశ్వర్ రెడ్డి, డైలీ వేజ్ సిబ్బంది , టోల్‌గేట్ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసరావుని వీధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు . వారి స్థానంలో ఇతర సిబ్బందిని నియమించారు.

# హెయిల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు బట్టల పంపిణి




హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్); సంక్రాంతి పండుగ, శోభబాబు పుట్టినరోజు పురస్కరించుకొని తార్నాకలో హెయిల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్, ఫాస్టియన్ ఫౌండేషన్ నేషనల్ న్యూ ఢిల్లీ ఇద్దరూ చరిమాన్ మరియు వ్యవస్థాపకుడు డా. లూర్దు జ్యోతి కాకుమాను, పిల్లర్ మాత ఫౌండేషన్ నేషనల్ న్యూ ఢిల్లీ చైర్మన్, వ్యవస్థాపకుడు డా. జగదీష్ కుమార్ పోలంకి వారు పేదలకు కొత్త బట్టలు,చీరెలు,దుప్పట్లు, పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రవీణ్ కుమార్ , సావిత్రి ప్రేమలత, కవిత, జగదాంబ , రాణి, సుజాత, ఉషా రాణి, లావణ్య, ప్రతిభ, శాంత కుమారి, సునీత, సభ్యులందరూ పాల్గొన్నారు.

# హర్యానా బీజేపీ అధ్యక్షుడు మోహన్‌లాల్ బడోలిపై రేప్‌కేసు

షిమ్లా జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హర్యానా బీజేపీ అధ్యక్షుడు మోహన్‌లాల్ బడోలిపై రేప్ కేసు నమోదయింది. ఆయనతోపాటు రాకీ మిట్టల్ అకా జై భగవాన్ అనే గాయకుడు తనపై సామూహిక లైంగికదాడి చేశారంటూ ఢిల్లీకి చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2023, జూలై 3న ఈ ఘటన జరిగినట్లు యువతి పేర్కొన్నది. తన యజమాని, స్నేహితురాలితో కలిసి హిమాచల ప్రదేశ్‌లోని కసౌలీకి వచ్చినప్పుడు బలాత్కారం చేశారని వెల్లడించింది. ఈ ఘటనపై గతేడాది డిసెంబర్ 13న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో 'తన బాస్, స్నేహితురాలితో కలిసి హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలన్ జిల్లా కసౌలీకి పర్యాటకురాలిగా వెళ్లాను. 2023, జూలై 3న నిందితులిద్దరు తమకు కలిశారు. బడోలి తనను తాను ఓ సీనియర్ రాజకీయ నాయకుడినని, తాను సింగర్‌ను అంటూ రాకీ పరిచయం చేసుకున్నారు. తాను తీయబోయే ఆల్బమ్‌లో నటిగా అవకాశం కల్పిస్తానని మిట్టల్, తనకు పెద్ద స్థాయిలో పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఇద్దరు కలిసి తమను ప్రలోభపెట్టారు. అనంతరం తమకు బలవంతంగా మద్యం తాగించారు. నా స్నేహితురాలిని బెదిరించి పక్కకు తీసుకెళ్లారు. ఆ తర్వాత నాపై ఇద్దరూ కలిసి లైంగికదాడికి పాల్పడ్డారు. నా నగ్న చిత్రాలు, వీడియోలు తీశారు. దానిని చూపించి ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపేస్తామని బెదిరించారంటూ' బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, నిందితులపై 376డీ, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేశామని సోలన్ ఎస్పీ గౌరవ్ సింగ్ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నావని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు.

# 77వ సైనిక దినోత్సవం సందర్భంగా రక్షణ దళాల ప్రధానాధికారి శుభాకాంక్షలు భారతీయ సైన్యం గొప్ప సేవాతత్పరతతో, అకుంఠిత దీక్షతో దేశ నిర్మాణానికి సహాయపడుతోందంటూ ప్రశంస

న్యూఢిల్లీ, జనవరి 16:77వ సైనిక దినోత్సవం సందర్భంగా రక్షణ దళాల ప్రధానాధికారి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ భారత సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఒక సందేశాన్నిస్తూ.. మన సైనికుల్లోని అంకితభావం, వారి ధైర్య సాహసాలూ, ఓటమి అంటే ఏమిటో తెలియని వారి స్వభావాన్నీ, చిత్తశుద్ధినీ గుర్తుచేసుకొంటూ వేడుకగా జరుపుకొనే రోజు అనీ, మన దేశ భద్రతకూ, ఐక్యతకు భారతీయ సైన్యం మూలస్తంభంగా నిలుస్తోందనీ అన్నారు.

ఎన్ని సవాళ్లెదురైనా మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతూ, దేశ ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయగలిగిన శక్తిసామర్థ్యాలు భారతీయ సైన్యానికి వారసత్వంగా లభించాయని జనరల్ అనిల్ చౌహాన్ అభివర్ణించారు. "మన సైనికుల నిరంతర దృఢ ప్రయత్నాల వల్లే మన సైన్యం అప్రమత్తంగా ఉంటూ, అన్ని విధాలైన సైనిక కార్యకలాపాల్లో రాణిస్తూ, ఎప్పటికీ దేశ పౌరుల రక్షణకూ, వారి క్షేమానికీ పూచీపడుతోంది. ఇది ఎంతైనా అభినందనీయం" అని ఆయన అన్నారు.

శత్రువులతో యుద్ధంలో అనుసరించాల్సిన పద్ధతులు రోజురోజుకూ వేగంగా మారుతున్నాయనీ, కొత్త టెక్నాలజీని ఉపయోగించుకోవడం పెరుగుతోందనీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. ఆధునిక యుద్ధ వ్యూహాల రూపురేఖలను చాలా వేగంగా మార్చేస్తున్నారనీ, టెక్నాలజీ ఎప్పటికప్పుడు మారిపోతుండడమే దీనికి కారణమన్నారు. దీంతో భౌగోళిక-రాజకీయ స్థితిగతులు కూడా మార్పులకు లోనవుతున్నాయని అన్నారు. సైబర్ ప్రపంచం, అంతరిక్షంలతోపాటు మనిషి మేధస్సు వికసిస్తుండడం అనేక కొత్త రంగాల్లో వివిధ దేశాల మధ్య శత్రుత్వ భావన చోటు చేసుకుంటున్నదని ఆయన వివరించారు. "కొత్త తరం టెక్నాలజీలు, కృత్రిమ మేధస్సు డేటాను బలమైన ఆయుధంగా వాడుకోవడం, యుద్ధతంత్రాలను అవతలిపక్షం ఊహాకు అందకుండా అత్యంత దూకుడుగా మార్చుకోవడం, శబ్ద వేగాని కన్నా 5 రెట్లు లేదా అంతకన్నా ఎక్కువ వేగంతో ప్రయాణించే తరహా సాంకేతికతలతో దాడులు చేయడం, రోబోటిక్స్ వంటి నూతన శాస్త్రవిజ్ఞానం ఆధారంగా భవిష్యత్తులో యుద్ధాలు ఊహాకందని విధంగా ఉంటాయి" అని కూడా ఆయన ఒక హెచ్చరికగా చెప్పారు.

రానున్న కాలంలో యుద్ధాలు గతంలో మాదిరిగా ఉండవనీ, ఎలాగైనా గెలవాలనేదే ఏ సైన్యానికైనా లక్ష్యంగా ఉంటుందని జనరల్ అనిల్ చౌహాన్ ప్రస్తావించారు. భారతీయ సైన్యం తన ప్రత్యర్థి పక్షాల కన్నా ఒక అడుగు ముందుండడానికి సాంకేతికంగా తన శక్తియుక్తులకు పదును పెట్టుకోవడంతోపాటు ఎత్తుగడల్లో, సాంకేతిక విజ్ఞానంలో, విధానాల్లో ఉన్నత స్థితిలో నిలబడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సిబ్బందికి ఉన్నత సాంకేతిక సామర్థ్యాన్ని సమకూర్చడంతోపాటు ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్స్ టెక్నాలజీలో వారిని నిపుణులుగా తీర్చిదిద్దడం ఎంతైనా అవసరమంటూ పిలుపునిచ్చారు.

కర్తవ్య నిర్వహణ పథంలో ప్రాణత్యాగాలు చేసిన ధీర శూర సైనికులకు సీడీఎస్ నివాళులు అర్పించారు.

"ఈ ప్రత్యేక రోజును మనం పాటించుకొంటున్న సందర్భంలో, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృఢనిశ్చయంతో, సగర్వంగా ఎదుర్కొని, సైన్యానికున్న గొప్ప సంప్రదాయాల్ని నేను కాపాడతాను అంటూ సైన్యంలో ప్రతి ఒక్కరూ సంకల్పం చెప్పుకొని తీరాలి. మాతృభూమికి మన సైన్యం ఘన విజయాల్నీ, కీర్తినీ సంపాదించిపెడుతూ, అలసట లేకుండా దేశ నిర్మాణానికి సహకరించాలని నేను కోరుకుంటున్నాను" అని జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు.

# అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం పెరుగుతోంది

-యావత్తు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతోంది
-మన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు భంగం కలుగుతోంది
-అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆందోళన

న్యూయార్క్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఫేర్‌వెల్ ప్రసంగం చేశారు. అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం పెరుగుతోందని వార్నింగ్ ఇచ్చారు. అది ప్రమాదకరంగా మారుతోందన్నారు. దశాబ్ధాల రాజకీయ కెరీర్‌కు స్వస్తి పలుకుతూ.. బైడెన్ మీడియాతో మాట్లాడారు. అత్యంత సంపన్నమైన, శక్తివంతమైన, ప్రభావంతమైన వ్యక్తుల చేతుల్లో అధికారం ఉన్నదని, ఇది యావత్తు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతోందని, మన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు భంగం కలుగుతోందని బైడెన్ ఆందోళన వ్యక్తం చేశారు. 82 ఏళ్ల బైడెన్ శ్వేతసౌధం నుంచి చివరి టీవీ ప్రసంగం చేశారు. వాతావరణ మార్పులు, సోషల్ మీడియా దుష్ ప్రచారంపై వార్నింగ్ ఇచ్చారు. తన సింగిల్ టర్మ్ పాలనలో సాధించిన ఘనతల గురించి ఆయన వివరించారు. ఉద్యోగాల కల్పన, మౌళికసదుపాయాలపై ఖర్చు, ఆరోగ్య పరిరక్షణ, కోవిడ్ నుంచి బయటపడడం, మళ్లీ దేశాన్ని నెంబర్ వన్ స్థానంలో ఎలా నిలిపారన్న అంశాలను ఆయన తన ప్రసంగంలో చెప్పారు. తాము చేసిన పని ఫలితాలు అందాలంటే ఇంకా సమయం పడుతుందన్నారు. మేం విత్తనాలు నాటామని, అవి పెరుగుతాయని, కొన్ని దశాబ్ధాల పాటు ఆ పుష్పాలు వికసిస్తాయన్నారు. అమెరికా ప్రజలపై సమాచార దాడి జరుగుతోందని, తప్పుడు సమాచారం ప్రచారం ఎక్కువగా ఉందని, దీంతో అధికార దుర్వినియోగం జరుగుతోందన్నారు. మెటా లాంటి సోషల్ మీడియా కంపెనీలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సోషల్ మీడియాలో ఫ్యాక్ట్ చెకింగ్ జరగడం లేదన్నారు. అబద్ధాలతో నిజాన్ని కప్పిపుచ్చుతున్నారన్నారు.

# టీజీ ఎప్‌సెట్ తేదీలు ఖరారు.. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ పరీక్షలు

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ ఉన్నత విద్యామండలి కీలక ప్రకటన విడుదల చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు పరీక్ష తేదీలను ఉన్నత విద్యామండలి వెల్లడించింది. బీఈ, బీటెక్, బీ ఫార్మసీ, ఫార్మ్ డీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలను ఏప్రిల్, మే నెలలో నిర్వహించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులకు సంబంధించి ఏప్రిల్ 29, 30 తేదీల్లో, ఇంజినీరింగ్ కోర్సులకు మే 2 నుంచి 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. టీజీ ఈసెట్ ప్రవేశ పరీక్షను మే 12, టీజీ ఎడ్‌సెట్‌ను జూన్ 1, టీజీ లాసెట్, ఎల్ఎల్ఎం కోర్సులకు జూన్ 6, ఐసెట్ పరీక్షలను జూన్ 8, 9 తేదీల్లో, టీజీ పీజీఈసెట్ పరీక్షలను జూన్ 16 నుంచి 19 వరకు, టీజీ పీఈసెట్ ప్రవేశ పరీక్షలను జూన్ 11 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటించింది.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు పూనుకోవాలి

– తెలంగాణ సర్కారుకు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ వినతి.

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); పర్యావరణ పరిరక్షణకు తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తక్షణమే రాష్ట్రంలో పూర్తి స్థాయిలో నిషేదించాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ తెలంగాణ సర్కారుకు మరోమారు విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో ప్రకృతి విధ్వంసం జరుగుతోందని కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య బుధవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. లక్షా 50 వేల కోట్లతో మూసీనది ప్రక్షాళన, చెరువుల పరిరక్షణకు హైడ్రా లాంటి ప్రత్యేక చట్టం తో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ సింగిల్ యూజ్ అనర్థాలపై దృష్టి సారించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. సమస్యను అధికారులే సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారా? అన్న ఆలోచన వస్తోందని రంగయ్య పేర్కొన్నారు. కనీసం కొత్త సంవత్సరంలో నైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను భేషరతు గా నిషేదించాలని కోరారు. ,ఇటీవల ఇదే విషయమై తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్య కార్యదర్శి రవి గుగులోతు ను కలిసి వివరించగా సింగిల్ యూజ్ వాడకాలపై, అమ్మకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారని, అయితే నిషేధం మాత్రమే నిజమైన పరిష్కారమని, ముఖ్యమంత్రి దృష్టి సారించాలని ప్రత్యేకంగా రంగయ్య విజ్ఞప్తి చేశారు.

# నవంబర్ నెల వేతనాలు చెల్లించాలి.. ఆర్పీల ధర్నా..



నిజామాబాద్,జనవరి 16: పెండింగ్ లో ఉన్న నవంబర్ నెల వేతనాలు చెల్లించాలని రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ? నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు అనుబంధంగా పనిచేస్తున్న మెప్మా ఆర్పీల నవంబర్ నెల వేతనాలు విడుదల చేయాలని జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సర్వేను తామే చేస్తున్నామని తెలిపారు. కానీ ప్రభుత్వ నుంచి తమ వేతనం విడుదలైనా నిజామాబాద్ పీడీ రాజేందర్ మాత్రం నవంబర్ నెల వేతనాలు విడుదల చేయడం లేదని వాపోయారు. ఈ విషయమై తాము అడిగితే సమగ్ర కుటుంబ సర్వే చేయలేదని చెబుతున్నారని తెలిపారు. సర్వేను కేవలం 14మంది మాత్రమే వివిధ ఆరోగ్య కారణాల వల్ల చేయలేదని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినా అధికారులు తమపై వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. నవంబర్ నెలకు సంబంధించి టూ డైరీలు సమర్పించిన, ప్రభుత్వానికి పంపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. తమ పెండింగ్ వేతనాలు వచ్చే దాకా తాము నిరసన కార్యక్రమా లు చేపడతామని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయమై న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్పిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆయన పద్యాలు తమిళ సంస్కృతి సారానికీ, మన తాత్విక వారసత్వానికీ ప్రతిబింబం: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 16: తిరువళ్లువర్ దినోత్సవం సందర్భంగా గొప్ప తమిళ తత్వవేత్త, కవి, ఆలోచనాపరుడు తిరువళ్లువర్ ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ స్మరించుకున్నారు. తమిళ సంస్కృతి సారాన్నీ, మన తాత్విక వారసత్వాన్నీ తిరువళ్లువర్ గొప్ప పద్యాలు ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు. "అజరామరమైన ఆయన కృతి 'తిరుక్కురల్' అనేక అంశాలపై లోతైన పరిజ్ఞానాన్ని అందిస్తూ ప్రేరణకు దీప్తిగా నిలుస్తుంది" అని శ్రీ మోదీ తెలిపారు.

"తిరువళ్లువర్ దినోత్సవం సందర్భంగా... మన దేశ గొప్ప తత్వవేత్త, కవి, ఆలోచనాపరుడైన మహానుభావుడు తిరువళ్లువర్ ను స్మరించుకుంటాము. ఆయన పద్యాలు తమిళ సంస్కృతినీ, మన తాత్త్విక వారసత్వాన్నీ ప్రతిబింబిస్తాయి. ఆయన బోధనలు ప్రధానంగా ధర్మం, కరుణ, న్యాయాన్ని ఉపదేశిస్తాయి. అజరామరమైన ఆయన కృతి 'తిరుక్కురల్' అనేక అంశాలపై లోతైన బోధలను అందిస్తూ ప్రేరణకు దీప్తిగా నిలుస్తుంది. మన సమాజానికి ఆయనా చూపిన దిశలో కొనసాగడానికి కృషి చేస్తూనే ఉంటాము'' అని ప్రధానమంత్రి 'ఎక్స్' లో పేర్కొన్నారు.

# సాయుధ బలగాలు, వారి కుటుంబాల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 16:సైనిక దినోత్సవం సందర్భంగా భారత సైన్యం అచంచల ధైర్యసాహసాలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అభివాదం చేశారు. భారత సైన్యం పట్టుదల, వృత్తిపరమైన నైపుణ్యం, అంకితభావానికి ప్రతీక అని అన్నారు. ''సాయుధ బలగాలు, వారి కుటుంబాల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. కొన్నేళ్ళుగా మేము అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాం. ఆధునికీకరణపై దృష్టి పెట్టాం" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

సైనిక దినోత్సవం సందర్భంగా... మన దేశ భద్రతకు రక్షణగా నిలుస్తున్న భారత సైన్యం అచంచల ధైర్యసాహసాలకు నా వందనం. అలాగే, ప్రతిరోజూ కోట్లాది మంది భారతీయుల భద్రతకు భరోసా ఇస్తున్న వీర జవాన్ల త్యాగాలను కూడా స్మరించుకుంటున్నాం. భారత సైన్యం సంకల్పం, వృత్తి సామర్థ్యం, అంకితభావానికి ప్రతీక. మన సరిహద్దులను కాపాడడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో మానవతా సహాయం అందించడంలో కూడా మన సైన్యం తన ప్రత్యేకతను చాటింది. సాయుధ బలగాలు, వారి కుటుంబాల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. కొన్నేళ్ళుగా అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి ఆధునికీకరణపై దృష్టి సారించాం. రానున్న రోజుల్లోనూ ఇది కొనసాగుతుంది" అని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో పేర్కొన్నారు.

# కెటిఆర్‌కు సుప్రీం కోర్టు షాక్.. క్వాష్ పిటిషన్ విత్ డ్రా..

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఫార్ములా ఈ రేస్ కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు వెళ్లినా మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు ఊరట లభించలేదు. ఆయన తన క్వాష్ పటిషన్ ను విత్ డ్రా చేసుకున్నారు. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కెటిఆర్ సుప్రీంకోర్టు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన దాఖలు చేసిన ఎస్ఎల్ పి పిటిషన్ పై బుధవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కెటిఆర్ లాయర్, ప్రభుత్వ లాయర్లు తమ వినిపించారు. అనంతరం సుప్రీంకోర్టు మాట్లాడుతూ.. ఈ కేసులో విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. మీకు ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో కెటిఆర్ వేసిన క్వాష్ పిటిషన్ ను విత్ డ్రా చేసుకుంటున్నట్లు ఆయన తరఫు లాయర్ కోర్టుకు తెలిపారు. మరోవైపు, రేపు విచారణకు రావాలని కెటిఆర్ కు ఈడీ నోటీసులు జారీ చేసింది.

# దేశమంతటా 21 ప్రధాన విమానాశ్రయాల్లో ఎఫ్‌టిఐ - టీటీపీ సేవలు

న్యూఢిల్లీ, జనవరి 16:'ఫాస్ట్ ట్రాక్ ఇమిగ్రేషన్ – ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రాం' (ఎఫ్‌టిఐ – టీటీపీ)నికేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా రేపు, అంటే 2025 జనవరి 16న, అహ్మదాబాద్ నుంచి ప్రారంభించనున్నారు.

ఈ ఎఫ్‌టీఐ – టీటీపీ సేవలు అహ్మదాబాద్, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, కొచ్చిన్‌లతోపాటు హైదరాబాద్‌లోనూ అమలులోకి రానున్నాయి. హోం మంత్రి ఇప్పటికే కిందటి ఏడాది జూన్ 22న ఈ ఎఫ్‌టీఐ – టీటీపీ సేవలను న్యూఢిల్లీ ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ) లో మూడో టెర్మినల్ నుంచి ప్రారంభించారు. 2047కల్లా వికసిత్ భారత్‌ను ఆవిష్కరించాలన్న లక్ష్యాన్ని సాధించడంలో 'ఫాస్ట్ ట్రాక్ ఇమిగ్రేషన్ – ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రాం' ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకున్న ఒక ముఖ్య నిర్ణయం.

ఇమిగ్రేషన్ విషయంలో ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సేవల్ని అందించడం, వారికి అంతర్జాతీయ ప్రయాణాల్ని ఇబ్బందులూ లేనివిగా తీర్చిదిద్దడం ఎఫ్‌టిఐ – టీటీపీ లక్ష్యాలు. మొదట్లో ఈ సదుపాయాన్ని భారతదేశ పౌరులకు, ఓవర్‌సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డును కలిగి ఉన్న వ్యక్తులకు ఉచితంగానే అంది స్తారు. ఈ ప్రోగ్రాంలో పేరు నమోదు చేసుకోవ డానికి దరఖాస్తుదారులు వారి వివరాలను నింపి, అవసరమైన కాగితాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. నమోదు పూర్తి అయిన దరఖాస్తుదారుల బయోమెట్రిక్ డేటాను ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) లో గాని, లేదా విమానాశ్రయం నుంచి వెళ్లేటప్పుడు గాని సేకరిస్తారు.

# మహాకుంభ్ ప్రయాగరాజ్ 2025 కోసం ఎలక్ట్రానిక్స్ & సమాచార సాంకేతిక శాఖ రూపొందించిన భాషిణి 11 భాషల్లో అందుబాటులో ఉంది

న్యూఢిల్లీ, జనవరి 16: 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్ వద్ద భక్తులకు బహుళ భాషల్లో సహాయాన్ని అందుబాటులో ఉంచేందుకు ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ భాషిణి ఏకీకరణ ద్వారా సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంగమంలో పాల్గొనే భక్తులకు 'డిజిటల్ లాస్ట్ ఢ ఫౌండ్ సొల్యూషన్' ద్వారా భాషణి భాషానువాద వ్యవస్థ ఎలా పనిచేస్తుందో కింద చూడండి:

గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన కుంభ్ రాజీస్ట్ర'ంఎ'ఎజీని అనేది మహా కుంభ్ 2025 కోసం ఇక్కడకు వచ్చే లక్షలాది సందర్శకుల సహాయం కోసం రూపొందించిన ఏఐ–ఆధారిత, బహుళభాషలు, వాయిస్‌ను అనుమతించే చాట్‌బాట్. అత్యాధునిక ఏఐ సాంకేతికతలతో (ఎల్ఎల్ఏఎమ్ఎ ఎల్ఎల్ఎమ్ వంటివి) ఈ బాట్‌ను రూపొందించారు. కుంభ్ సహాయక్ యాత్రికులకు అవసరమైన సమాచారం అలాగే మార్గదర్శనం విషయంలో సహాయం అందించడం ద్వారా వారి మహాకుంభ్ 2025 అనుభవాన్ని మరుపురానిదిగా చేసే లక్ష్యంతో పనిచేస్తుంది.

అందరి కోసం సజావుగా, సకాలంలో సమాచారాన్ని, మార్గదర్శన సహాయాన్ని అందించడం ద్వారా సందర్శకుల అనుభవాలను మెరుగుపరిచేందుకు కుంభ్ సహాయక్ ను రూపొందించారు. భాషిణిలోని భాష అనువాదం హిందీ, ఇంగ్లీష్, 9 భారతీయ భాషలు సహా మొత్తం 11 భాషల్లో చాట్‌బాట్‌కు మద్దతునిస్తుంది.

యుూపీ 112 అత్యవసర హెల్ప్‌లైన్

దేశం నలుమూలల నుంచి అలాగే విదేశాల నుంచి మహా కుంభ్‌కు తరలివచ్చే భక్తులకు ప్రయాగరాజ్, పరిసర ప్రాంతాల్లో మాట్లాడే భాషను అర్థం చేసుకునేందుకు సహాయం అవసరం. భాషిణి మొబైల్ అప్లికేషన్‌లోని 'కన్వర్స్' (వార్తాలాప్) ఫీచర్ ఈ మెగా ఈవెంట్ వద్ద ఏర్పాటు చేసిన యూపీ పోలీసుల 112 హెల్ప్‌లైన్ విభాగంతో భక్తులు సజావుగా సంభాషించడాన్ని సులభతరం చేస్తుంది. భాషా అవరోధం కారణంగా సహాయం కోరే బాధలో ఉన్న భక్తుల మనోవేదనలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు రాకుండా యాప్‌లోని సంభాషణ ఫీచర్‌ను ఉపయోగించుకునేలా క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వడానికి ఉత్తరప్రదేశ్ పోలీస్ శాఖ భాషిణి యాప్‌తో కలిసి పనిచేస్తోంది.

అందువల్ల భాషిణి బహుళ భాషల మద్దతుతో మహా కుంభ్ 2025 సందర్శకులకు వారి సందేహాలు, మార్గదర్శన సహాయం విషయంలో అద్భుతమైన అనుభవాన్ని అందించే లక్ష్యంతో పనిచేస్తుంది. మొత్తం మీద, భాషిణి భాషా అనువాద వ్యవస్థ ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారందరి కోసం ఒక చక్కని, సమీకృత అనుభవాన్ని అందిస్తూ, సాంకేతిక ఆవిష్కరణలు, యాక్సెసిబిలిటీ పట్ల ఎమ్ఇఐటివైకి గల నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.

# వాతావరణ విజ్ఞానంలో ప్రగతి వల్ల మన విపత్తు నిర్వహణ సామర్థ్యం వృద్ధి చెందింది..

న్యూఢిల్లీ, జనవరి 16: భారత వాతావరణ విభాగం (ఐఎండి) 150వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నేడు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. 'ఐఎండి' సాగించిన ఈ 150 ఏళ్ల ప్రయాణం దేశంలో ఆధునిక శాస్త్ర–సాంకేతిక పరిజ్ఞానాల సగర్వ పురోగమనానికి కూడా ప్రతిబింబమని ఆయన అభివర్ణించారు. ఒకటిన్నర శతాబ్దాలుగా కోట్లాది భారతీయులకు సేవలందిస్తున్న 'ఐఎండి' ప్రస్థానం భారత శాస్త్రవిజ్ఞాన ప్రగతికి ప్రతీక అని వ్యాఖ్యానించారు. ఇన్నేళ్లుగా ఈ విభాగం సాధించిన విజయాలకు గుర్తుగా స్మారక తపాలాబిళ్లతోపాటు నాణాన్ని కూడా ఇవాళ ఆవిష్కరించామని శ్రీ మోదీ అన్నారు. భారత్ స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలు నిర్వహించుకునే 2047నాటికి ఈ సంస్థ భవిష్యత్తును విశదీకరించే 'ఐఎండి దార్శనిక పత్రం–2047'ను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించామని ఆయన పేర్కొన్నారు. ఒకటిన్నర శతాబ్దాల 'ఐఎండి' మహత్తర ప్రస్థానం సందర్భంగా దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ 150 ఏళ్ల ప్రయాణంపై వేడుకలలో యువతరాన్ని కూడా మమేకం చేస్తూ జాతీయ వాతావరణ ఒలింపియాడ్‌ను 'ఐఎండి' నిర్వహించిందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఇందులో పాలుపంచుకున్న వేలాది విద్యార్థులకు దీనివల్ల వాతావరణ శాస్త్రంపై ఆసక్తి ఇనుమడిస్తుందని చెప్పారు. తన ప్రసంగానికి ముందు వేదిక వద్ద ప్రదర్శనల సమయంలో యువతతో తన సంభాషణను శ్రీ మోదీ ప్రస్తావిస్తూ– నేటి కార్యక్రమంలో పాల్గొన్న యువతరానికి అభినందనలు తెలిపారు.

మకర సంక్రాంతి పర్వదినానికి కాస్త అటూఇటూగా 1875 జనవరి 15న 'ఐఎండి' ఆవిర్భవించిందని శ్రీ మోదీ గుర్తుచేశారు. "భారత సంప్రదాయంలో మకర సంక్రాంతికిగల ప్రాధాన్యం మనందరికీ తెలిసిందే" అన్నారు. ఆ మేరకు గుజరాత్ వాసిగా ఇది తనకూ ఎంతో ఇష్టమైన పండుగని ఆయన పేర్కొన్నారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని 'ఉత్తరాయనం'గా వ్యవహరిస్తామని, ఈ పర్వదినాన్నే మకర సంక్రాంతిగా నిర్వహించుకుంటామని వివరించారు. గగనంలో సూర్యగమనం ఉత్తరం వైపు మారడాన్ని ఇది సూచిస్తుందని చెప్పారు. దీంతో ఉత్తరార్ధగోళంలో సూర్యకాంతి క్రమంగా పెరుగుతూ పంటల సాగుకు రైతులు సిద్ధం కావడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ రోజున దేశం నలుదిశల్లోనూ రకరకాల పేర్లతో, వివిధ సాంస్కృతిక రూపాల్లో వేడుకలతో ప్రజలు మకర సంక్రాంతి పండుగ చేసుకుంటారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ పర్వదినం సందర్భంగా పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

"ఏ దేశంలోనైనా విజ్ఞాన సంస్థల పురోగమనమే శాస్త్ర విజ్ఞానంపై దానికిగల అవగాహనను ప్రతిబింబిస్తుంది" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. ఆ సంస్థలలో పరిశోధన–ఆవిష్కరణలు నవ భారతావనికి స్వాభావికమని ఆయన వ్యాఖ్యానించారు. గడచిన దశాబ్ద కాలంలో 'ఐఎండి' మౌలిక సదుపాయాలు, సాంకేతికతలు అద్భుత స్థాయిలో విస్తరించాయని చెప్పారు. ఈ మేరకు డాప్లర్ వాతావరణ రాడార్లు, స్వయంచలిత వాతావరణ కేంద్రాలు, రన్‌వే వాతావరణ పర్యవేక్షణ వ్యవస్థలు, జిల్లాలవారీ వర్షపాత పర్యవేక్షణ కేంద్రాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఇవన్నీ అప్‌గ్రేడ్ అవ్వడంతో దేశంలో వాతావరణ విజ్ఞానశాస్త్రం అంతరిక్ష, డిజిటల్ సాంకేతికతల నుంచి ఎంతో ప్రయోజనం పొందుతోందని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రకటించారు.

అంటార్కిటికాలో 'మైత్రి, భారతి' పేరిట ఈ శాఖకు రెండు వాతావరణ పరిశీలన ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరం సూపర్ కంప్యూటర్లు 'ఆర్క్, అరుణిక''లను ప్రారంభించడాన్ని ప్రధాని గుర్తుచేశారు. 'ఐఎండి' విశ్వసనీయత పెరుగుదలను ఇది ప్రస్ఫుటం చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. భారత్‌ను వాతావరణ–స్మార్ట్ దేశంగా మార్చడమే 'మిషన్ మౌసమ్' ధ్యేయమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. సుస్థిర భవితతోపాటు భవిష్యత్ సంసిద్ధతపై మన నిబద్ధతకు ఇదొక చిహ్నమని పేర్కొన్నారు. ఆ మేరకు దేశం అన్ని రకాల వాతావరణ పరిస్థితులనూ ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉందన్నారు. ఆ మేరకు వాతావరణ–స్మార్ట్ దేశంగా మారడం లక్ష్యంగా 'మిషన్ మౌసమ్'ను ప్రారంభించినట్లు ప్రధానమంత్రి ప్రకటించారు.

దేశం ఉన్నత శిఖరాలను చేరడంలో మాత్రమేగాక సామాన్య జనజీవన సౌలభ్యం మెరుగుపరచడంలోనూ శాస్త్రవిజ్ఞానానికి ఔచిత్యం ఉంటుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఐఎండి' తన ప్రయాణంలో ప్రతి ఒక్కరికీ కచ్చితమైన వాతావరణ సమాచారం అందించే విధంగా ముందడుగు వేసిందని ఆయన వ్యాఖ్యానించారు. తదనుగుణంగా 'అందరికీ ముందస్తు హెచ్చరిక' కార్యక్రమం ఇప్పుడు జనాభాలో 90 శాతానికి పైగా ప్రజలకు విస్తరించిందని ప్రధాని స్పష్టీకరించారు. దేశంలో గత–రాబోయే 10 రోజుల వాతావరణ సమాచారాన్ని ఎవరైనా, ఎప్పుడైనా పొందవచ్చునని, వాట్సాప్‌లో కూడా అంచనాలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అలాగే 'మేఘదూత్ మొబైల్ యాప్' అన్ని స్థానిక భాషలలో వాతావరణ సమాచారం అందిస్తుందని ఆయన చెప్పారు. పదేళ్ల కిందట రైతులు, పశుపోషకులలో 10 శాతం మాత్రమే వాతావరణ సంబంధిత సలహాలను వాడుకున్నారని, ఇప్పుడు 50 శాతానికిపైగా ప్రజలు వాడుకుంటున్నారని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఇప్పుడు మొబైల్ ఫోన్లలో పిడుగుపాటుపై ముందస్తు హెచ్చరికలు సాధ్యమేనని ఆయన ప్రస్తావించారు. గతంలో లక్షలాది మత్స్యకార కుటుంబాలు సముద్రంలో చేపల వేటకు వెళితే వారంతా తిరిగి వచ్చేదాకా అందరూ ఆందోళన పడేవారని గుర్తుచేశారు. కానీ, నేడు 'ఐఎండి' సహకారంతో మత్స్యకారులకు సకాలంలో హెచ్చరికలు అందుతున్నాయని ప్రధాని ప్రముఖంగా చెప్పారు. ఈ ప్రత్యక్ష సమాచార నవీకరణతో భద్రత పెరగడంతోపాటు వ్యవసాయం, నీలి ఆర్థిక వ్యవస్థ తదితర రంగాలు కూడా బలోపేతం కాగలవన్నారు.

''ఏ దేశంలోనైనా విపత్తు నిర్వహణ సామర్థ్యానికి వాతావరణ విజ్ఞానం అత్యంత కీలకం" అని శ్రీ మోదీ అన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించడానికి ఈ విజ్ఞానం సామర్థ్యాన్ని గరిష్ఠంగా వాడుకోవాలన్నారు. భారత్ ఈ ప్రాధాన్యాన్ని సదా అర్థం చేసుకుంటూ వస్తున్నదని పేర్కొన్నారు. ఒకప్పుడు విపత్తు దుష్ప్రభావాలు అనివార్యమనే భావన ఉండేది కాగా, నేడు వాటికి సత్వర ఉపశమనం లభిస్తున్నదని స్పష్టం చేశారు. కచ్‌లోని కాండ్లాలో 1998నాటి తుఫాను, 1999నాటి ఒడిశా లో సూపర్ సైక్లోన్ ఫలితంగా వేలాది ప్రజలు ప్రాణాలు కోల్పోగా, విపరీతంగా ఆస్తి విధ్వంసం సంభవించిందని గుర్తుచేశారు. కానీ, ఇటీవలి కాలంలో అనేక పెద్ద తుఫానులు, విపత్తులు సంభవించినా మన దేశం చాలా సందర్భాల్లో ప్రాణనష్టం నివారణ, తగ్గింపులో విజయవంతమైందని ప్రధాని పేర్కొన్నారు. ఈ విజయాలలో వాతావరణ శాఖ కీలక పాత్ర పోషించిందంటూ ప్రశంసించారు. శాస్త్రవిజ్ఞానం, సర్వసన్నద్ధతల ఏకీకరణతో కోట్లాది రూపాయల మేర ఆర్థిక నష్టాలను నివారించగలిగామని చెప్పారు. అలాగే ఆర్థిక వ్యవస్థలో పుంజుకోగల శక్తి ఇనుమడించిందని, దీంతో పెట్టుబడిదారులలో విశ్వాసం కూడా పెరిగిందని తెలిపారు.

"ప్రపంచంలో ఒక దేశ ప్రతిష్ఠకు అక్కడి శాస్త్రవిజ్ఞాన ప్రగతి, దాని సంపూర్ణ సద్వినియోగం కొలబద్ద" అని ప్రధానమంత్రి అన్నారు. వాతావరణ విజ్ఞానంలో పురోగమనంతో మన విపత్తు నిర్వహణ సామర్థ్యం బలోపేతమైందని చెప్పారు. తద్వారా యావత్ ప్రపంచం ప్రయోజనం పొందుతున్నదని తెలిపారు. మన ఫ్లాష్ ఫ్లడ్ గైడెన్స్ వ్యవస్థ నేడు నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి పొరుగు దేశాలకు కూడా సమాచారం ఇస్తున్నదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 'విశ్వబంధు'గా పేరు తెచ్చుకున్న భారత్, అందుకు తగినట్లుగానే ప్రకృతి విపత్తులు, సంక్షోభ సమయాల్లో ఇతర దేశాలకు చేయూతనివ్వడంలో సదా ముందువరుసలో ఉంటుందని చెప్పారు. దీంతో అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ ఇనుమడించిందని చెప్పారు. ఈ ఘనతలు సాధించడంలో గణనీయ కృషి చేశారంటూ 'ఐఎండి' శాస్త్రవేత్తలను ఆయన కొనియాడారు.

'ఐఎండి' 150వ వార్షికోత్సవం నేపథ్యంలో భారత వాతావరణ విజ్ఞాన ఘన చరిత్రను శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. వాతావరణం మానవ పరిణామాన్ని ప్రభావితం చేసిన ప్రాథమికాంశమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వాతావరణం, పర్యావరణాలను అర్థం చేసుకోవడానికి నిరంతరం కృషి చేశారని చరిత్ర మనకు చెబుతోందని గుర్తుచేశారు. ఇందులో భాగంగా వేదాలు, సంహితలు, సూర్య సిద్ధాంతం వంటి పురాతన గ్రంథాలలో వాతావరణంపై భారత సంప్రదాయ జ్ఞానం పొందుపరచారని తెలిపారు. అంతేకాకుండా ఇది నిరంతరం మెరుగుపడుతూ లోతుగా అధ్యయనం కూడా సాగిందని స్పష్టం చేశారు. తమిళనాడు సంగమ సాహిత్యం, ఉత్తర భారతంలో 'ఘాఘ్ భడ్డరీ' జానపద సాహిత్యంలో వాతావరణ విజ్ఞానంపై విస్తృత సమాచారం ఉందని శ్రీ మోదీ ఉటంకించారు. ప్రాచీన కాలంలో వాతావరణ విజ్ఞానాన్ని ప్రత్యేక శాఖగా పరిగణించలేదన్నారు. ఖగోళ గణన, వాతావరణ అధ్యయనాలు, జంతు ప్రవర్తన, సామాజిక అనుభవాలతో ఇది ముడిపడి ఉండేదని చెప్పారు. మేఘాల రకాలు, స్వరూపాలపై అధ్యయనంతో రూపొందిన 'కృషి పరాశర్, బృహత్ సంహిత' వంటి గ్రంథాలను ప్రధాని ప్రస్తావించారు. అలాగే గ్రహస్థానాలపై గణిత శాస్త్ర కృషిని కూడా గుర్తుచేశారు. అధిక లేదా అల్ప వాతావరణ పీడనం, ఉష్ణోగ్రతల వంటివి మేఘాల లక్షణాలతోపాటు వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయని 'కృషి పరాశర్' వివరించినట్లు శ్రీ మోదీ పేర్కొన్నారు. ఆధునిక యంత్ర పరికరాలేవీ లేని ఆ రోజుల్లో పండితులు నిర్వహించిన విస్తృత పరిశోధనలను ప్రస్తావిస్తూ వారి లోతైన జ్ఞానం, అంకితభావాన్ని ప్రస్తుతించారు. ఈ విధంగా నిరూపిత సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో మేళవించాల్సిన ఆవశ్యకతను ప్రధాని స్పష్టం చేశారు. ఈ దిశగా మరిన్ని పరిశోధనలు చేయాలని కూడా కోరారు. ఈ సందర్భంగా శతాబ్దాల నాటి గుజరాత్ నావికుల సముద్ర పరిజ్ఞానంపై రూపొందించిన "ప్రీ–మోడరన్ కచ్ నావిగేషన్ టెక్నిక్స్ అండ్ వాయేజెస్" పుస్తకాన్ని కొన్నేళ్ల కిందట తాను ఆవిష్కరించినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రకృతిపైనా, జంతు ప్రవర్తన మీద లోతైన అవగాహన సహా దేశంలోని గిరిజన వర్గాలకుగల ఘనమైన అనుభవ జ్ఞాన వారసత్వాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. సమకాలీన శాస్త్రీయ పద్ధతులతో ఈ జ్ఞానంపై మరింత లోతైన అధ్యయనం ద్వారా వాటిని ఏకీకృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇక 'ఐఎండి' వాతావరణ సూచనల్లో కచ్చితత్వం మరింత పెరిగితే వాటి ప్రాధాన్యం కూడా పెరుగుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. వివిధ రంగాలు, పరిశ్రమలు సహా దైనందిన జీవితంలోనూ 'ఐఎండి' సమాచారానికి డిమాండ్ పెరుగుతుందని పేర్కొన్నారు. భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలపై హెచ్చరిక వ్యవస్థల రూపకల్పన సహా భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని కృషి కొనసాగాలని ప్రధాని స్పష్టీకరించారు. శాస్త్రవేత్తలు, విద్యార్థి పరిశోధకులు, 'ఐఎండి' వంటి సంస్థలు వినూత్న ఆవిష్కరణల దిశగా శ్రమించాలని చెప్పారు. చివరగా– ప్రపంచ మానవాళి సేవ, భద్రతలో భారత్ కీలక పాత్ర పోషించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఐఎండి' 150 ఏళ్ల ప్రస్థానంలో, వాతావరణ శాస్త్ర ప్రగతిలో పాలుపంచుకున్న వారందరికీ అభినందనలు తెలుపుతూ ప్రధానమంత్రి తన ప్రసంగం ముగించారు.

కంద్ర భూవిజ్ఞానశాస్త్రాల సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్, ప్రపంచ వాతావరణ సంస్థ సెక్రటరీ జనరల్ ప్రొఫెసర్ సెలెస్టే సౌలో తదితర ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ వేడుకలలో భాగంగా– భారత్‌ను 'వాతావరణ సంసిద్ధ–వాతావరణ సాంకేతిక' దేశంగా రూపొందించే ధ్యేయంతో రూపొందించిన 'మిషన్ మౌసమ్'ను ప్రధాని ప్రారంభించారు. అత్యాధునిక వాతావరణ పరిశీలన సాంకేతిక పరిజ్ఞానాలు–వ్యవస్థలతోపాటు అధిక సాంద్రతగల వాతావరణ విశ్లేషణ చిత్రాలు, భవిష్యత్తరం రాడార్లు–ఉపగ్రహాల రూపకల్పన సహా అధిక సామర్థ్యంగల కంప్యూటర్ల తయారీ వంటి లక్ష్యాల సాధన ఈ కార్యక్రమంలో అంతర్భాగంగా ఉంటుంది. అలాగే వాతావరణం–సంబంధిత అంచనా ప్రక్రియలపై అవగాహన మెరుగుదల, దీర్ఘకాలిక వాతావరణ నిర్వహణ, కార్యకలాపాల వ్యూహాత్మక రూపకల్పనలో తోడ్పడే వాయు నాణ్యత సమాచార సేకరణపైనా 'మిషన్ మౌసమ్' దృష్టి సారిస్తుంది.

అంతేకాకుండా వాతావరణ ప్రతిరోధకత, వాతావరణ మార్పులతో సంధానం దిశగా రూపొందించిన 'ఐఎండి దార్శనిక పత్రం–2047ను ఆయన ఆవిష్కరించారు. వాతావరణ అంచనా, నిర్వహణ, శీతోష్ణస్థితి మార్పు సమస్యల ఉపశమన ప్రణాళికలు ఇందులో భాగంగా ఉంటాయి.

'ఐఎండి' 150వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా గత 150 ఏళ్లలో ఈ విభాగం సాధించిన విజయాలు, దేశాన్ని వాతావరణ ప్రతిరోధకంగా తీర్చిదిద్దడంలో దాని కృషి, వివిధ వాతావరణ–శీతోష్ణస్థితి సంబంధిత సేవల ప్రదానంలో ప్రభుత్వ సంస్థల పాత్ర వగైరాలను వివరిస్తూ అనేక కార్యక్రమాలు, కార్యకలాపాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు.

# మన సాయుధ దళాల మాజీ సైనికులు... హీరోలు, దేశభక్తికి ప్రతీకలు: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 16:సాయుధ దళాల సీనియర్ జవాన్ల దినోత్సవం (వెటరన్స్ డే) సందర్భంగా ప్రధానమంత్రి ఈ రోజు మన దేశరక్షణ కోసం తమ జీవితాలను అంకితం చేసిన ధైర్యవంతులైన మాజీ సైనికులకు కృతజ్ఞతలు తెలియచేశారు. వెటరన్ జవాన్లను వీరులుగా, దేశభక్తికి శాశ్వత ప్రతీకలుగా ప్రధాని అభివర్ణించారు.

'సాయుధ దళాల సీనియర్ జవాన్ల (వెటరన్స్ డే) దినోత్సవం సందర్భంగా, దేశాన్ని రక్షించడానికి తమ జీవితాలను అంకితం చేసిన ధైర్యవంతులైన మహిళలు, పురుషులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వారి త్యాగాలు, ధైర్యసాహసాలు, విధి నిర్వహణలో వారి అచంచలమైన నిబద్ధత ఆదర్శనీయం. మన సీనియర్ జవాన్లు వీరులు, దేశభక్తికి చిరస్మరణీయ చిహ్నాలు. మాది ఎల్లప్పుడూ అనుభవజ్ఞుల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం. ఇకముందు కూడా ఇలాగే పనిచేస్తాం'' అని ప్రధానమంత్రి ట్వీట్ చేశారు.

# సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

అమరావతి, జనవరి 15: సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతిచెందిన ఘటన ఏపీలోని ప్రకాశం జిల్లాలో చోటు చేసుకుంది. సముద్ర స్నానానికి వెళ్లిన ఐదుగురిలో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. సింగరాయకొండ పాకల బీచ్‌లో ఇవాళ ఐదుగురు సముద్రస్నానానికి వెళ్లారు. సముద్రంలో అలల తాకిడికి ఐదుగురూ గల్లంతయ్యారు. గల్లంతైన ఇద్దరిలో ఒకరిని జాలర్లు కాపాడగా మరో ముగ్గురు మృతి చెందారు. మరొకరి కోసం మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మృతులు పొన్నలూరు మండలం తిమ్మపాలెంకు చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాలను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు కూలీలు దుర్మరణం

అమరావతి, జనవరి 15:ఏపీలోని ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. మండలంలోని కలగొట్ల వద్ద పొగాకు కూలీ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో మార్కాపురం మండలం భూపతిపల్లికి చెందిన ఇద్దరు కూలీలు మరణించగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాల య్యాయి.

ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను కంభం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

# ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్

## -బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట.. బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : బషీర్‌బాగ్ ఈడీ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫార్ములా–ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈడీ విచారణకు హాజరైన నేపథ్యంలో ఈడీ ఆఫీస్‌కు భారీ ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. కాగా, ఫార్ములా–ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈడీ విచారణకు హాజరయ్యారు. గచ్చిబౌలిలోని తన నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయల్దేరిన కేటీఆర్.. బషీర్‌బాగ్‌లోని ఈడీ ఆఫీస్‌కు చేరుకున్నారు.ఈ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, ఈ నెల 7న విచారణకు కేటీఆర్ హాజరవాల్సి ఉన్నది. అయితే ఏసీబీ కేసును కొట్టివేయాలని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వు చేసిన నేపథ్యంలో.. తీర్పు వచ్చేవరకు అవకాశం ఇవ్వాలని కోరారు. దీంతో 16న విచారణకు రావాలంటూ ఈడీ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన విచారణకు హాజరయ్యారు.అంతకుముందు.. ఫార్ములా–ఈ కార్ రేస్‌ను తెలంగాణకు తీసుకువచ్చి ప్రపంచపటంలో హైదరాబాద్ నగరాన్ని నిలపడం మంత్రిగా తాను తీసుకున్న గొప్ప నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుందంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. 'ఫార్ములా రేసు సందర్భంగా అంతర్జాతీయ రేసర్లు, ఈ–మొబిలిటీ రంగానికి చెందిన ప్రముఖులు హైదరాబాద్ నగరాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. ఎన్ని రకాల చిల్లర కేసులు, బురదజల్లే కార్యక్రమాలు, రాజకీయ వేధింపులకు పాల్పడినా ఈ రేసు ద్వారా సాధించిన విజయాలను తగ్గించలేవు. మంత్రిగా ఉన్నా లేకున్నా బ్రాండ్ హైదరాబాద్‌ను పెంపొందించడమే ఎల్లవేళలా ముఖ్యమైన అంశంగా నేను భావిస్తాను. ఫార్ములా–ఈ రేసు హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా పటంలో నిలిపింది. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విజన్, నిబద్ధత, హైదరాబాద్ నగరం అంటే అమితమైన ప్రేమ ఉండాలి. అందుకే ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నా..రాష్ట్ర ప్రభుత్వం పంపిన రూ.46 కోట్లు ఫార్ములా–ఈ సంస్థకు అత్యంత పారదర్శకంగా బదిలీ చేయడం జరిగింది. కేవలం బ్యాంకు లావాదేవీగా స్పష్టమైన రికార్డు ఉంది. ఒక్క రూపాయి కూడా వృధా కాలేదు. ప్రతి నయా పై సాకూ లెక్క ఉంది. మరి అలాంటప్పుడు ఇందులో అవినీ తి, మనీలాండరింగ్ ఎక్కడ ఉంది?. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న అసంబద్ధమైన రేసు రద్దు నిర్ణయం వల్లే రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది. ఎలాంటి తప్పు లేకున్నా కేవలం రాజకీయ వేధింపుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు కేసుల విచారణ పేరుతో ఈ అంశాన్ని లాగుతున్నది. కచ్చితంగా ఈ అంశంలో నిజమే గెలుస్తుం ది. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రజలు, కోర్టులు కూడా త్వరలో తెలుసుకుంటాయి. అప్పటిదాకా న్యాయం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.' అని కేటీఆర్ అన్నారు.

# హాస్పిటల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. విధులకు హాజరుకాని సిబ్బంది తొలగింపు



నల్గొండ, జనవరి 16:నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి గుర్రంపోడు మండలం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలానే ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఇక కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా పలువురు విధులకు హాజరుకాలేదు.

సిబ్బంది మొత్తం ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారు. దాంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఫార్మసిస్ట్, ల్యాబ్ అటెండెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్లు సకాలంలో విధులకు హాజరుకాకపోవడం గుర్తించారు.. దీంతో కలెక్టర్ వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే ప్రతి ఉద్యోగిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నప్పటికీ.. ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని గాలికి వదిలేసి సిబ్బంది గైర్హాజరు కావడం బాధాకరమని నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడ జరిగినా ఉద్యోగాల నుంచి తొలగించడం లేదా విధుల నుండి సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కలెక్టర్ ఇలా త్రిపాఠి పని తీరుపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పసుపు దిగుబడి పెంచేందుకు అపారమైన అవకాశాలు: శ్రీ గోయల్

న్యూఢిల్లీ, జనవరి 16:జాతీయ పసుపు బోర్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ ఈ రోజు న్యూఢిల్లీ నుండి ప్రారంభించారు. పసుపు బోర్డు మొదటి అధ్యక్షునిగా శ్రీ పల్లె గంగారెడ్డి పేరును శ్రీ గోయల్ ప్రకటించారు. నిజామాబాద్‌లో బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

దేశవ్యాప్తంగా సంబరాలు జరుపుకునే పండుగ రోజున జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. జాతీయ పసుపు బోర్డులో వివిధ మంత్రిత్వ శాఖల ప్రాతినిధ్యంతో పాటు ఎగుమతిదారులు, ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

పసుపును 'గోల్డెన్ స్పైస్' అని కూడా పిలుస్తారన్న మంత్రి, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మేఘాలయ సహా 20 రాష్ట్రాల్లో గల పసుపు రైతుల సంక్షేమంపై కొత్తగా ఏర్పడిన బోర్డు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేంద్ర మంత్రి సూచించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పసుపు ఉత్పత్తిని పెంచేందుకు అపారమైన అవకాశాలున్నాయన్న ఆయన, పసుపు బోర్డు ఏర్పాటుతో దేశంలోని పసుపు ఉత్పత్తిదారుల ఆదాయం పెరుగుతుందన్నారు.

కొత్త పసుపు ఉత్పత్తుల పరిశోధన, అభివృద్ధిని కొత్త బోర్డు ప్రోత్సహిస్తుందని, అలాగే విదేశాల్లో మార్కెటింగ్ కోసం పసుపు సంబంధిత ఉత్పత్తుల విలువ పెంపును పరిశీలిస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. పసుపులో గల మేలైన, వైద్యపరమైన గుణాలను గురించి అవగాహన పెంపొందించడం, దాని దిగుబడిని పెంచే మార్గాలను అలాగే కొత్త మార్కెట్లలోకి వాణిజ్యాన్ని విస్తరించుటకు లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్‌ను అభివృద్ధి చేసేందుకు మార్గాలను కూడా బోర్డు పరిశీలిస్తుందని ఆయన చెప్పారు. పసుపు ఉత్పత్తి, ఎగుమతుల నాణ్యతను అలాగే భద్రతా ప్రమాణాలను కూడా బోర్డు నిర్ధారిస్తుందని శ్రీ గోయల్ తెలిపారు.

గత 2023–24 సంవత్సరంలో, దేశంలో 3.05 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పసుపు సాగుతో, 10.74 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించినట్లు శ్రీ గోయల్ చెప్పారు.

ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70 శాతానికి పైగా భారతదేశంలోనే ఉత్పత్తి అవుతోందని అలాగే 30 రకాల పసుపు మన దేశంలో ఉత్పత్తి అవుతోందని ఆయన వివరించారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ అరవింద్ ధర్మపురి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బోర్డు అధ్యక్షునితో పాటు, ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఫార్మాస్యూటికల్స్ శాఖ, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అలాగే వాణిజ్య శాఖల ప్రతినిధులు కూడా బోర్డుకు నామినేట్ అయ్యారు. పసుపు అత్యధికంగా పండించే రెండు ప్రధాన రాష్ట్రాలైన మహారాష్ట్ర, తెలంగాణల ప్రతినిధులతో పాటు, లకడాంగ్ పసుపు సాగుతో ప్రసిద్ధి చెందిన మేఘాలయ రాష్ట్ర ప్రతినిధులకు కూడా బోర్డులో ప్రాతినిధ్యం కల్పించనున్నారు. దేశంలో పసుపు రంగం అభివృద్ధి, ఎదుగుదలపై జాతీయ పసుపు బోర్డు దృష్టి సారిస్తుంది.

జాతీయ పసుపు బోర్డు పసుపు రంగానికి సంబంధించిన విషయాల్లో నాయకత్వాన్ని, విస్తరణకు అవకాశాలను అందించడంతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు/ఏజెన్సీలతో సమన్వయాన్ని సులభతరం చేస్తుంది. అలాగే దేశంలో పసుపు రంగ అభివృద్ధి, విస్తరణ కోసం తోడ్పాటునందిస్తుంది. ముఖ్యంగా పసుపులో గల ఆరోగ్యం, శ్రేయస్సు సంబంధిత ప్రయోజనాల దృష్ట్యా పసుపు, దాని ఉత్పత్తుల వ్యాపారాభివృద్ధి కోసం గల విస్తారమైన సామర్థ్యాలపై దృష్టి సారించుటలో సహాయపడుతుంది.

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారు, వినియోగదారు అలాగే ఎగుమతిదారుగా ఉంది.

ప్రపంచ వాణిజ్యంలో మన దేశం 62 శాతానికి పైగా వాటాను కలిగి ఉంది.

2023–24లో 226.5 మిలియన్ యూఎస్ డాలర్ల విలువైన 1.62 లక్షల టన్నుల పసుపు, పసుపు ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కేసు

నాగర్‌కర్నూల్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కేసు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని భ్రమరాంబ ఆలయం వద్ద నిన్న(గురువారం) రాత్రి పోలీసు విధులకు ఆటంకం కలిగించాడని మాజీ ఎమ్మెల్యే బాలరాజుపై ఎస్ఐ రమేశ్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు గువ్వల బాలరాజు, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ ఆలయంలో ఉన్నాడని, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును ఆలయంలోకి అనుమతించలేదు.దీంతో గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నేతలు అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, గువ్వల బాలరాజు అనుచరుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఆలయం ఎదుటే బైఠాయించి వారు నిరసన తెలిపారు. అయితే నన్ను కావాలనే పోలీసులు ఆలయంలోకి వెళ్లకుండా ఆపారని గువ్వల మండిపడ్డారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ అనే వ్యక్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీ కృష్ణతో కుమ్మక్కై నన్ను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని బాలరాజు ఆరోపించారు. న్యాయ వ్యవస్థ సుమోటోగా కేసు స్వీకరించించి తనకు న్యాయం చేయాలని కోరిన విషయం తెలిసిందే.

# అంకుర సంస్థల సంస్కృతిని ప్రోత్సహించడానికి ఏ అవకాశాన్నీ ప్రభుత్వం వదల్లేదు: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 16:స్టార్టప్ ఇండియా కార్యక్రమానికి నేటితో తొమ్మిదేళ్లు పూర్తయినట్టు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తు చేశారు. వినూత్న ఆలోచనలతో విజయవంతమైన అంకుర సంస్థల ఏర్పాటు ద్వారా తొమ్మిదేళ్లుగా అసంఖ్యాకంగా యువతను ఈ విప్లవాత్మక కార్యక్రమం సాధికారులను చేసిందని ప్రధానమంత్రి శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. "ప్రభుత్వానికి సంబంధించినంత వరకు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడానికి అందుబాటులో ఉన్న ఏ అవకాశాన్నీ మేం వదిలిపెట్టలేదు" అని శ్రీ మోదీ పునరుద్ఘాటించారు. స్టార్టప్ ఇండియా సాధించిన ఈ విజయం నేటి భారత క్రియాశీలతనూ, ఆత్మవిశ్వాసాన్నీ, భవిష్యత్ సన్నద్ధతనూ ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "స్టార్టప్ ప్రపంచంలోని ప్రతీ యువకుడికీ నా అభినందనలు.. మరింత మంది యువత దీన్ని అందిపుచ్చుకోవాల్సిందిగా కోరుతున్నాను. మీరు నిరాశ చెందబోరని చెప్పడానికి నాదీ హామీ" అని శ్రీ మోదీ భరోసానిచ్చారు.

. ఆవిష్కరణలకూ, కొత్త పారిశ్రామికవేత్తల ఆవిర్భవానికీ, అభివృద్ధికీ కొత్త భాష్యం చెప్పిన విప్లవాత్మకమైన కార్యక్రమం. యువత సాధికారతను ముందుకు తీసుకెళ్లగల శక్తిమంతమైన మార్గం. నా మనస్సు గెలుచుకున్న పథకం కూడా ఇదే. వినూత్న ఆలోచనలతో విజయవంతమైన అంకుర సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా గత తొమ్మిదేళ్లుగా ఈ పథకం పెద్దఎత్తున యువత జీవితాలను మార్చేస్తున్నది".

"ప్రభుత్వానికి సంబంధించినంత వరకు.. స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడానికి గల ఏ అవకాశాన్నీ మేం వదులుకోలేదు. విధాన రూపకల్పనలో సులభతర వాణిజ్యానికి పెద్దపీట వేశాం. వనరులను భారీగా అందుబాటులోకి తెచ్చాం. మరీ ముఖ్యంగా, ప్రతీ దశలోనూ వారికి అండగా నిలిచాం. ఆవిష్కరణలతోపాటు అంకుర సంస్థల ఏర్పాటుకు అవసరమైన తొలిదశ మాతృసంస్థలను (ఇంక్యుబేషన్ సెంటర్లు) ప్రోత్సహించాం. తద్వారా, సవాళ్లను ఎదుర్కొనగల సమర్థతను మన యువతకు అందించాం. కొత్తగా అంకుర సంస్థలను ఏర్పాటు చేస్తున్న వారితో నేను ఎప్పటికప్పుడు స్వయంగా మాట్లాడుతూ, ప్రోత్సహిస్తూ వస్తున్నాను."

"భారత్ నేడు క్రియాశీలకంగా, ఆత్మవిశ్వాసంతో, భవిష్యత్ సన్నద్ధంగా ఉన్నదనడానికి స్టార్టప్ ఇండియా సాధించిన ఈ విజయమే నిదర్శనం. ఈ ప్రస్థానం సందర్భంగా ఔత్సాహిక పారిశ్రామిక వాతావరణాన్ని సృష్టించడంలో మా నిబద్ధతను కొనసాగిస్తామని పునరుద్ఘాటిస్తున్నాం. ఆత్మనిర్భర భారతావని దిశగా ప్రతి కలనూ సాకారం చేస్తూ ముందుకు సాగుతాం. స్టార్టప్ జగత్తులోని ప్రతీ యువతేజానికీ నా అభినందనలు. ఈ స్ఫూర్తికి కొనసాగింపుగా మరింతగా యువత ముందుకు రావాలని పిలుపునిస్తున్నాను. మీరు నిరాశ చెందబోరని చెప్పడానికి నాదీ హామీ."

# ఉపగ్రహాల స్పేస్ డాకింగ్ ప్రయోగం విజయవంతం: ఇస్రోకు ప్రధాని అభినందనలు

న్యూఢిల్లీ, జనవరి 16:స్పేస్ డాకింగ్ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడంపై ఇస్రోకూ, అంతరిక్ష నిపుణులందరికీ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

భవిష్యత్తులో ప్రతిష్ఠాత్మక అంతరిక్ష కార్యక్రమాలు చేపట్టే దిశగా భారత్ కు ఇదొక కీలకమైన ముందడుగు అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ లో చేసిన ఒక పోస్టులో ప్రధానమంత్రి ఇలా పేర్కొన్నారు.

అంతరిక్షంలో ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసిన మన ఏతిబతీనీ శాస్త్రవేత్తలకూ, అంతరిక్ష నిపుణులందరికీ శుభాకాంక్షలు. ముమ్ముందు ప్రతిష్ఠాత్మక అంతరిక్ష కార్యక్రమాలు చేపట్టే దిశగా భారత్ వేసిన కీలకమైన ముందడుగు ఇది.

# విజన్ డాక్యుమెంట్-2047తో గేమ్ ఛేంజర్ - చంద్రబాబు

అమరావతి, జనవరి 16:రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండేందుకు ప్రత్యేక విజన్‌ను తీసుకొస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. పీ4 విధానం గేమ్ ఛేంజర్ కానున్నదని పేర్కొన్నారు. విజయవాడలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడమే తమ లక్ష్యమని అన్నారు. వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఫ్యామిలీ (పీ3) విధానంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. సంపద సృష్టించాలంటే అభివృద్ధి జరగాలి. అభివృద్ధి వల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదాయం పెరిగితే పేదవారిని పైకి తీసుకురావచ్చని వివరించారు. ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికం నిర్మూలించవచ్చని ఆయన అన్నారు.

ఏపీకి పోలవరం జీవనాడి అని.. కానీ వైసీపీ హయాంలో పోలవరాన్ని గోదావరిలో కలిపేశారని మండిపడ్డారు చంద్రబాబు. గత పాలకులు రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ హయాంలో వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాష్ట్రానికి రావాలంటే భయపడ్డారన్నారు. పారిశ్రామిక వేత్తలను కూడా భయపెట్టారని తెలిపారు. సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచుతామని.. ఆదాయం పెరిగితే పేదవాళ్ళకు సంక్షేమ పథకాలను అమలు చేసి పెద్దవాళ్ళను పైకి తీసుకురావచ్చని చెప్పుకొచ్చారు. అప్పట్లో ఆర్థిక సంస్కరణలు ఫలితాలను ఇచ్చాయన్నారు. తాను వాటిని మనసా వాచా నమ్మానన్నారు. విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి వెలుగులు పెంచానని.. కానీ తాను అధికారాన్ని కోల్పోయానని తెలిపారు. ఐటీని తీసుకువచ్చానని, ఈరోజు ఐటీ అనేక కుటుంబాల్లో జీవనోపాధి కలిపించిందన్నారు.

ఇండియాలో నెంబర్ 1 అయ్యి తెలంగాణకు బ్యాక్ బోన్‌గా మారిందని.. తెలంగాణకు హైదరాబాద్ ద్వారా అత్యధిక తలసరి ఆదాయం వస్తుందన్నారు. ఐటీ తిండి పెడుతుందా అని చాలా మంది ఎగతాళి చేశారని.. ఐటీ ఇప్పుడు ఎక్కడికో తీసుకెళ్తోందన్నారు. సంపద పెంచితే ఆదాయం పెరిగి సంక్షేమ పథకాల అమలుకు అవాకాశం ఉంటుందని.. ఇదే తాను నమ్మిన సిద్ధాంతమన్నారు. ఆర్థిక సంస్కరణలు అప్పట్లో వేరే మార్గం లేకుండా చేశారని.. అయితే రెండో తరం సంస్కరణలను తాను మొదలుపెట్టినట్లు తెలిపారు. పవర్ సెక్టార్ రిఫార్మ్స్, విమానాశ్రయాలకు ఓపెన్ స్కై పాలసీ, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, రోడ్లకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు నుంచి చెన్నైకి తరువాత గోల్డెన్ క్వార్డలైటర్‌లు వచ్చాయని? సంపద వచ్చింది ఆదాయం పెరిగిందని తెలిపారు.

జీఎస్‌డీపీ ముఖ్యం..

"నేను పెన్షన్ పెంచాను.. దీని వలన వారిని చూసేందుకు పిల్లలు ముందుకు వస్తున్నారు. మనుషులను మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులను అందరినీ కనెక్ట్ చేస్తున్నాను. ఇల్లు అన్నింటికీ జియో ట్యాగింగ్ చేయిస్తున్నాను. ఎందుకంటే ఇవన్నీ కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసమే. పీ ? 4 అనేది ఒక గేమ్ చేంజర్‌గా మారుతుంది. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారు అట్టడుగు స్థాయి ఉన్నవారిని పైకి తీసుకురావాల్సి ఉంటుంది. ఇందుకోసం జీఎస్‌డీపీ ముఖ్యం. నేను అనుకున్న లక్ష్యానికి భవిష్యత్తులో రీచ్ అవుతాము. మేము తయారు చేసిన విజన్ డాక్యుమెంట్‌పై 16 లక్షల మంది తమ అభిప్రాయాలను ఇచ్చారు. చివరకు కేంద్రం వికసిత భారత్‌కు కూడా అన్ని అభిప్రాయాలు రాలేదు" అని ముఖ్యమంత్రి అన్నారు.

ఫ్యామిలీ మెంబర్స్ అందరికి కనెక్ట్ చేసి ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నామన్నారు. విపత్తు వస్తే ప్రతి ఇంటికి సాయం అందించగలుగుతామన్నారు. వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఫ్యామిలీ సాధనే లక్ష్యమన్నారు. పీ4 భవిష్యత్తులో ఒక గేమ్ చేంజర్ అవుతుందని.. గతంలో పీ 3 సంపద సృష్టించిందన్నారు. ఇండియా 1 నుంచి 2 శాతం గ్రోత్ చేయడం వల్ల దాన్ని హిందూ గ్రోత్ రేట్ అని ఎగతాళి చేశారన్నారు. ప్రజల్ని భాగస్వాములను చేయాలనేది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఏడు నెలలు ఏం చేశామో దక్షిణాది రాష్ట్రాలతో కంపేర్ చేసి చెపుతామన్నారు.

"టీడీపీ పాలనలో 13.5 శాతం గ్రోత్ ఉంది.. ఇకపై ఈ గ్రోత్ రేట్ 15 శాతం పెంచాలని చూస్తున్నాం. 2047 నాటికి ఈ వృద్ధి సాధిస్తే 58 లక్షల14 వేలు 916 కోట్ల తలసరి ఆధాయం సాధిస్తాం. ఏపీ నుంచి అమెరికా వెళ్లిన వారు అక్కడి వారి కన్నా ఎక్కువ సంపాదిస్తున్నారు. ఆ ఎన్విరాన్మెంట్ ఇక్కడ కూడా కల్పిస్తే మన ఆదాయం కూడా భారీగా పెరుగుతుంది. వృద్ధిరేటును డబుల్ చేస్తే నాలుగున్నర రెట్లు ఆదాయం పెరిగిపోతుంది. గత ఏడాది కంటే ఈ ఏడు 4.03 శాతం వృద్ధి రేటు పెరిగింది. 1 శాతం ఆదాయం పెరిగితే ఏటికేడు ఆధాయంలో పెరుగుదల వస్తుంది. ఈ ఏడాది గ్రోత్ రేటు 12. 94శాతం పెరిగింది. రాష్ట్ర సొంత ఆదాయం, అటు ఎఫ్ఆర్‌బీఎం కూడా ఇలా వెళితే భారిగా పెరుగుతుంది. ఈ వృద్ధి రేటు సాధించకపోతే అప్పు చేయాలి అప్పడు డెట్ ట్రాప్‌లోకి వెళ్లిపోతాం. ఆదాయం పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. గత ఏడాది వృద్ధి రేటు 8.20 ఉంటే ఇప్పుడు 12.94 శాతంకు చేరింది. ఆల్ ఇండియా గ్రోత్ కంటే 3.24 శాతం అధనంగా గ్రో అయ్యాయి. 2019-24 కాలంలో పర్ క్యాపిటా ఇన్ కం కూడా పడిపోయింది. టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారి వ్యవసాయం రైతుకు అండగా ఉన్నాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# తిరుపతి నుంచి వెళ్లిపోవాలని మంచు మనోజ్‌కు పోలీసుల వార్నింగ్



అమరావతి, జనవరి 16: ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్‌బాబు ఫ్యామిలీలో వివాదాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. నిన్న తిరుపతిలోని మోహన్‌బాబుకు చెందిన వర్సిటీకి మంచు మనోజ్ రావడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన విషయం తెలిసిందే. చివరకు పోలీసులు జరిపిన చర్చలతో మంచు మనోజ్ తన తాత, నాయనమ్మ సమాధుల వద్ద నివాళి అర్పించి వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

అయితే తనపై, తన భార్య మౌనికపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడులకు పాల్పడ్డారంటూ చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో మంచు మనోజ్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మనోజ్‌కు పోలీసులు పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా తిరుపతి నుంచి వెళ్లిపోవాలని తెలిపారు.

అనంతరం ఆయన పోలీసు స్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతూ ఎవరితో గొడవ పెట్టడానికి రాలేదని, సంక్రాంతి పండుగను కూతురుతో కలిసి జరుపుకుందామని వచ్చానని తెలిపారు. అయితే రెండు రోజుల పాటు తనను పండుగను జరుపుకోకుండా ఆటంకాలు సృష్టించారని మీడియాకు వివరించారు.

తాను తిరుపతికి వస్తున్న సందర్భంగా తన అభిమానులు ఏర్పాటుచేసిన బ్యానర్లను చించివేయడం, అభిమానులను బెదిరించడం సరికాదని అన్నారు. ఫ్యాన్స్‌ను బెదిరించకుండా ఉంటే సైలెంట్‌గా ఉండేవాడినని తెలిపారు. తన కుటుంబ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబుతో గాని, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే నానికి వివరించ లేదని, సహాయం చేయాలని కూడా ఎవరినీ అడగలేదని వెల్లడించారు.

# గోద్రా రైలు ఘటనపై ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టులో విచారణ

న్యూఢిల్లీ, జనవరి 16: 2002లో జరిగిన గోద్రా రైలు ఘటనపై.. ఫిబ్రవరి 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గుజరాత్ ప్రభుత్వంతో పాటు అనేక మంది దాఖలు చేసిన పిటీషన్లపై విచారణ చేపట్టనున్నది. ఈ కేసు విచారణకు మరో తేదీని ఇవ్వబోమనని జస్టిస్ జేకే మహేశ్వరి, అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది.

2002, ఫిబ్రవరి 27వ తేదీన సబర్మతి రైలుకు చెందిన ఎస్-6 బోగీలో చెలరేగిన మంటల్లో సుమారు 59 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో 2017లో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ అనేక మంది సుప్రీంలో అప్పీల్ చేసుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిన 11 మంది నిందితులకు మరణశిక్ష విధించాలని కోరుతూ గత ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్ సర్కారు సుప్రీంను ఆశ్రయించింది.

అయితే గురువారం విచారణ సమయంలో ఓ నిందితుడి తరపున లాయర్ హాజరయ్యారు. కానీ ఆధారాలు సమర్పించలేకపోయారు. గత ఏడాది నుంచి ఈ కేసును ఇప్పటి అయిదు సార్లు వాయిదా వేశానని, ఇక మళ్లీ వాయిదా వేయబోమని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. కొందరు నిందితులకు చెందిన క్షమాభిక్ష పిటీషన్లు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకు లాయర్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వ అప్పీల్‌పై ముందుగా విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోరారు.

# లైవ్‌లో లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. రేవంత్ సిద్ధమా..? సీఎంకు కేటీఆర్ సవాల్



హైదరాబాద్, జనవరి 16:రేవంత్ రెడ్డిపై ఏసీబీ, ఈడీ కేసులు ఉన్నాయని చెప్పి.. తనపై కూడా ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేయించి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ కేసుల్లో వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలియజేసేందుకు తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం.. రేవంత రెడ్డి సిద్ధమా.. అని కేటీఆర్ సవాల్ విసిరారు. ఈడీ విచారణ ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

కక్ష సాధింపు చర్యలో భాగంగా ఈ కేసు పెట్టారు. విచారణ సంస్థలను, అధికారులను గౌరవించి ఈ నెల 9న ఏసీబీ విచారణకు హాజరయ్యాను. 16న ఈడీ విచారణకు హాజరయ్యాను. రెండు సంస్థలు కూడా ఒకటే రకమైన ప్రశ్నలు ఏడు గంటల పాటు అడిగారు. అన్ని వివరాలు తీసుకున్నారు. మీరు ఎన్ని సార్లు పిలిచినా వస్తాను. విచారణకు సహకరిస్తాను. రాజ్యాంగాన్ని న్యాయ వ్యవస్థను, కోర్టులను గౌరవించే బిడ్డగా చెబుతున్నా.. ఎన్ని ప్రశ్నలు అడిగినా సమాధానం చెప్తా.. పూర్తిగా విచారణకు సహకరిస్తాను. తన నిజాయితీని నిరూపించుకుంటానని చెప్పాను అని కేటీఆర్ తెలిపారు.

# ఇస్రో ఘనతపై శాస్త్రవేత్తలను అభినందించిన వైఎస్ జగన్

అమరావతి, జనవరి 16:భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ఘనత సాధించడం పట్ల వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇస్రోకు అభినందనలు తెలిపారు. ఇస్రో 2024 డిసెంబర్ 30న రాత్రి 10:00:15 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ప్రయోగాన్ని చేపట్టిన విషయం తెలిసిందే.

ఈ మిషన్‌లో భాగంగా శాస్త్రవేత్తలు(రాఇతివనిబితిబబిబ) ఖూఒఎ-అ60 ద్వారా రాఆచీ01 (ఛేజర్), రాఆచీ02 (టార్గెట్) అనే రెండు శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపించారు. ఈ శాటిలైట్లను ఖూఒఎ-అ60 విజయవంతగా నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అనంతరం రాఆచీ01 (ఛేజర్), రాఆచీ02 (టార్గెట్) ఉపగ్రహాలను రోదసిలో డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

ఈ సందర్భంగా వైఎస్ జగన్ ట్విటర్ వేదిక ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తలు అంతరిక్షంలో ఉపగ్రహాలను విజయవంతంగా డాకింగ్ చేయడం అద్భుతమైన మైలురాయని కొనియాడారు. ఈ విజయం రాబోయే సంవత్సరాల్లో భారతదేశ ప్రతిష్టాత్మక అంతరిక్ష కార్యకలాపాలకు కీలకమైన ముందడుగు వేస్తుందని ఆకాంక్షించారు.

# వేంకటరమణుడి సన్నిధిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



తిరుపతి, జనవరి 16: వేంకటరమణుడు కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఈనెల 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి సన్నిధికి చేరుకుంటున్నారు.

నిన్న 71,417 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 19,396 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.42 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

కన్నుల పండువగా గోదా కల్యాణం

టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలోని మైదానంలో బుధవారం రాత్రి కన్నుల పండువగా గోదా కల్యాణంజరిగింది. శ్రీకృష్ణస్వామి, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకరించారు. తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం, రక్షాబంధనం , అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు.

సర్కారు సంకల్పం, భక్తుల సంకల్పం, మధుపర్క నివేదనం, వస్త్ర సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం , అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నారు.

# శంషాబాద్‌లో రవాణా శాఖ అధికారుల దాడులు..16 బస్సులపై కేసులు నమోదు

హైదరాబాద్, జనవరి 16: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. వరుస దాడులతో ట్రావెల్స్ బస్సుల యజమానులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.మోటార్ వాహన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులపై దృష్టి సారించారు.

కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, కన్యాకుమారి, కర్ణాటక, బెంగుళూరు, ఆంధ్రప్రదేశ్, గోవాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు తనిఖీలు చేస్తున్నారు. తెలంగాణ ట్యాక్స్ కట్టని బస్సులపై కొరడా ఝులిపిస్తున్నారు. లగేజీ తరలించే వాహనాలపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 16 బస్సులపై కేసులు నమోదు చేశారు.

# రెండు నెలల గరిష్టానికి బంగారం ధర.. రూ.94 వేలకు కిలో వెండి

న్యూఢిల్లీ, జనవరి 16:ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కావడం, జ్యువెల్లర్లు, రిటైలర్ల నుంచి డిమాండ్ పెరగడంతో గురువారం బంగారం, వెండి ధరలు ధగధగమెరుస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం 99.9శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.500 వృద్ధితో రూ. 81,300లకు చేరుకున్నది. బుధవారం 99.9శాతం స్వచ్ఛత గల బంగారం పది గ్రాములు ధర రూ. 80,800 వద్ద ముగిసింది.

ఆభరణాలను తయారు చేసేందుకు వినియోగించే 99.5శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర సైతం రూ.500 పెరిగి రూ. 80,900 వద్ద స్థిర పడింది. బుధవారం 99.5శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ. 80,400 వద్ద ముగిసింది. మరోవైపు గురువారం కిలో వెండి ధర రూ. 2,300 వృద్ధితో రూ. 94,000లకు చేరుకుంది. బుధవారం కిలో వెండి ధర రూ. 91,700 వద్ద నిలిచింది.

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గురువారం గోల్డ్ కాంట్రాక్ట్స్ ఫిబ్రవరి డెలివరీ (బంగారం తులం ధర) రూ. 297 (0.38 శాతం), పెరిగి 79,007లకు చేరుకుంది. ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కావడంతో ఎంసీఎక్స్‌లో బంగారం తులం ధర రూ. 79వేల ఎగువన ట్రేడ్ అవుతున్నదని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ అనలిస్ట్ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ మీద రూపాయి మారకం విలువ 16 పైసలు పతనమై రూ. 86.56లకు పడిపోయింది. క్రూడాయిల్ ధరలు పెరిగిపోవడంతోపాటు దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించడంతో రూపాయి విలువ పతనమైంది. మరోవైపు, కిలో వెండి మార్చి డెలివరీ ధర రూ. 654 (0.7 శాతం) వృద్ధితో రూ. 93,510 వద్ద ముగిసింది.

అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 19.70 డాలర్లు వృద్ధి చెంది 2,737.50 డాలర్లకు చేరుకుంది. అంచనాలకు అనుగుణంగానే డిసెంబర్ అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణం వస్తుందన్న అంచనాల మధ్య బంగారానికి అదనపు మద్దతు లభించిందని జతిన్ త్రివేది తెలిపారు. అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గిస్తుందని భావిస్తున్నారు. ఇక మరోవైపు, ఆసియా మార్కెట్ ట్రేడింగ్ టైంలో అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం ధర 1.28 శాతం వృద్ధి చెంది 31.94 డాలర్లు పలికింది.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం.. యాదాద్రి జిల్లా వాసులు నలుగురు మృతి

న్యూఢిల్లీ, జనవరి 16: మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాత్రికులతో వెళ్తున్న తుఫాన్ వాహనం.. అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడడంతో, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా యాదాద్రి భువనగిరి జిల్లాలోని కొండగడప గ్రామానికి చెందిన వారు. షిరిడి దైవ దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇక నలుగురు మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసుల విచారణలో తేలింది. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పట్టపగలే రెచ్చిపోయిన దోపిడీ దొంగలు.. ఏటీఎం వాహనంపై దాడిచేసి నగదు లూటీ

కర్ణాటక,జనవరి 16: కర్ణాటక రాష్ట్రంలో పట్టపగలే దారి దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఏటీఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన వాహనంపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒకరు మరణించగా.. ఇద్దరు బ్యాంకు సిబ్బందికి గాయాలయ్యాయి. ఈ ఘటన బీదర్‌లో చోటు చేసుకుంది.

ఏటీఎంకు డబ్బులు తరలిస్తున్న వాహనంపై దోపిడీ దొంగలు దాడి చేశారు. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఓ సెక్యూరిటీ గార్డు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు బ్యాంకు సిబ్బందికి గాయాలైనట్లు తెలిసింది. దాడి అనంతరం డబ్బు పెట్టెలతో దుండగులు అక్కడి నుంచి ఉడాయించారు. అందులో సుమారు రూ. 93 లక్షల నగదు ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాడి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిని అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన సిబ్బందిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# ఎకో టూరిజం హబ్ ను ఏర్పాటు చేయండి.. కేంద్ర మంత్రికి శ్రీధర్ బాబు వినతి



కరీంనగర్, జనవరి 16: పెద్దపల్లి జిల్లాలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎకో టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర శకావత్ ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కోరారు. బుధవారం కేంద్రమంత్రిని కలిసి రామగిరి కోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు.

త్రివేణి సంఘమంలో ఉన్న కాలేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి పరచాలని కోరారు.

పెద్దపల్లి జిల్లాలో ఎకో టూరిజం హబ్ ను ప్రపంచంలోనే ప్రఖ్యాతి చెందేవిధంగా ఏర్పాటు చేయాలని కోరారు.

కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు.

